
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 04.03.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 40 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## నిలబడితేనే తలపడగలడు



- ఎమ్మెల్యేలు పోతే పోయేదేమీ లేదు
- పార్టీని నిలబెట్టుకోవడమే జగన్‌కు సవాల్
- తాను మారితే పార్టీ రాతను మార్చుకోవచ్చు

రాష్ట్రంలో గోడ దూకుడు ఎమ్మెల్యేల పరంపర కొనసాగుతోంది. ఇక అధికారం లేకుంటే అరగంట కూడా ఆగలేమన్నట్లున్న ఎమ్మెల్యేలు 8 మంది దాకా వైకాపాను వీడి తెలుగుదేశంలో చేరిపోయారు. వైకాపా నుండి ఇంకా కొంతమంది ఎమ్మెల్యేలు దేశంలో చేరే అవకాశాలనూ కొట్టిపారేయలేము. ఎందుకంటే ఈరోజు చచ్చినా వైకాపాను వీడేది లేదని జగన్ పక్కన నిలబడి స్టేట్‌మెంట్లిస్తున్న ఎమ్మెల్యేలు పక్కరోజే పచ్చ కండువా కప్పుకుంటున్నారు. కాబట్టి ఎవరు వైకాపాలో ఉంటారో, ఎవరు జగన్‌ను వీడుతారో తెలియని పరిస్థితి.

వైకాపా ఎమ్మెల్యేలందరినీ తెలుగుదేశంలో చేర్చుకోవడం ద్వారా రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని లేకుండా చేయాలని, వచ్చే ఎన్నికల్లో పోటీ లేకుండా ఏకపక్షంగా జరిగిపోవాలని చంద్రబాబు తన పార్టీ వారికి పిలుపునిచ్చాడు. వైకాపా ఎమ్మెల్యేలు 66మందిలో జగన్‌ను

(మిగతా 11వ పేజీలో)

## విద్యుత్ వెలుగులకు శ్రీకారం




రాష్ట్రానికి కానుకగా ఏపి జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రారంభోత్సవ వేడుక 5లో



3లో ఆనందోత్సవంగా సెంబ్‌కార్ప్ గాయత్రి పవర్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం




## విస్తరిస్తే విభేదాలే!

- మంత్రి పదవులపై చేరిన ఎమ్మెల్యేల ఆశలు
- కొత్త వారికి చోటిస్తే పాతనేతల్లో అసంతృప్తి

2014లో తెలుగుదేశం ప్రభత్వం ఏర్పడ్డాక ఇంతవరకు మంత్రివర్గ విస్తరణ జరగలేదు. అప్పుడు ఏర్పాటు చేసిన కేబినెట్‌తోనే చంద్రబాబు బండి నడుపుతున్నాడు. చాలారోజుల నుండి మంత్రివర్గంలో మార్పులు చేర్పులుంటాయని, పనితీరులో అత్తెసెరు మార్కులు కూడా సాధించని మంత్రులకు ఉద్వాసన పలికి కొత్తవారికి అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు వైకాపా ఎమ్మెల్యేలు కూడా వచ్చి చేరుతుండడంతో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ వుండబోతుందనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

ఇప్పటివరకు 8మంది వైకాపా ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరగా వారిలో ముగ్గురు దాకా మంత్రిపదవుల ఛాన్స్‌పై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో బలమైన నాయకుడిగా వున్న భూమా నాగిరెడ్డికి మంత్రిపదవి ఇస్తామన్న ఆశతోనే పార్టీలోకి తీసుకున్నారని సమాచారం. ఇక విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మైనార్టీ కోటాలో తనకు అవకాశం ఉండొచ్చని ఆశపడుతుంటే, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం ఎమ్మెల్యే డేవిడ్ రాజు, కడప జిల్లా బద్వేలు ఎమ్మెల్యే జయరాములు ఎస్సీ కోటాలో మంత్రి పదవులపై ఆశలు పెట్టుకోవడం గమనార్హం. 2014ఎన్నికల్లో తెలుగుదేశం నుండి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన ఎస్సీ, మైనార్టీ అభ్యర్థులు చాలా తక్కువ. ఈ వర్గాల నుండి ఎక్కువ ఎమ్మెల్యేలు గెలిచింది వైకాపా అభ్యర్థులుగానే! ఎస్సీ, మైనార్టీలకు చెందిన వైకాపా ఎమ్మెల్యేలు తెలుగుదేశంలోకి ఎగబడుతున్నది ఈ కోటాలో అవకాశం ఉంటుందనే!

(మిగతా 11వ పేజీలో)



# పంచాయతీలకు పన్ను బాధ తగ్గించండి

## - ఎమ్మెల్యే కోటంరెడ్డి వినతి

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని విలీన పంచాయతీల్లో వున్న ప్రజలకు పన్నుల భారం పడకుండా చూడాలంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన కార్పొరేషన్ మేయర్ అబ్దుల్ అజీజ్‌కు, కమిషనర్ వెంకటేశ్వర్లుకు విలీన పంచాయతీ నివాసుల బాధలను విన్నవించారు. ఇక్కడి ప్రజలు కార్పొరేషన్‌లో విలీనం కాకముందే ఇళ్ళు కట్టుకున్నారని, ఇంటి పన్నులు అధికంగా వేస్తుండడంతో ఆ పన్నులు కట్టడానికి ఎన్నో అవస్తలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలపై పన్నుల భారం పడకుండా చూడాలని, ఈ ప్రాంతాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మంత్రి నారాయణతో చర్చించి విలీన పంచాయతీల్లో పన్నుల భారం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకనాథ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్ యాదవ్, లేబూరు పరమేశ్వరరెడ్డి, కమలరాజు సంపూర్ణ, పాతపాటి శ్రీలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దశరథరామయ్య, కార్పొరేటర్ శైలజ పాల్గొన్నారు.

# వైసీపీని వదిలిన వారికి భవిష్యత్ లేదు



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 'బి'ఫారంతో గెలిచి ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యేలకు రాజకీయ భవిష్యత్తు ఉండదని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని కంటేపల్లిలో నిర్మించిన సిమెంటురోడ్డును ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రక్కనపెట్టి వైకాపా శాసనసభ్యుల కొనుగోలుపై దృష్టి పెట్టారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు అర్హులైన పేదలకు వాటి ఫలాలు అందటం లేదని విమర్శించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు వెంకట శేషమ్మ, సర్పంచి దొడ్డక శాంతి, ఎంపిటిసి బాణాల వెంకమ్మ, జిల్లా మండల కోఆప్షన్ సభ్యులు అక్బర్ బాషా, హుస్సేన్, ఎంపిడివో సుగుణమ్మ, తహశీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జేసిఐ వితరణ

జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సంస్థ నెల్లూరులో అనేక సామాజిక, ఆర్థిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కొరకు నెల్లూరు పప్పులవీధిలోని వైవియం(సత్రం బడి) స్కూలులో గత 25రోజులుగా అల్పాహారం అందిస్తోంది. ఇది ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసిఐ సభ్యులు, నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ నగరంలోని పలు మున్సిపల్ హైస్కూళ్లలో 10వ తరగతి చదువుతూ టాప్ ర్యాంకు తెచ్చుకున్న విద్యార్థులకు రూ.50వేలు నగదు బహుమతిని అందిస్తామన్నారు. జేసిఐ సంస్థ గత నాలుగేళ్లుగా 50మంది వృద్ధులకు కులమతాలకు అతీతంగా నెలరు రూ.400లు పెన్షన్ అందజేస్తుందని, పదవ తరగతి పరీక్షల్లో 8.8పైన మార్కులు సాధించిన విద్యార్థులు గత నాలుగేళ్లుగా టౌన్‌హాల్లో రూ.2వేల నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తుందని జేసిఐ నెల్లూరు అధ్యక్షులు వి.ఇ.మురలీకృష్ణ, మాజీ అధ్యక్షులు సిహెచ్ వెంకటశరణ్‌కుమార్, ట్రెజరర్ బి.జనార్ధన్, సభ్యులు సురేష్‌బాపూజీ, మధుసూదన్‌లు తెలిపారు.

# డబుల్ రిజిస్ట్రేషన్ ముఠాలపై నిఘా

నెల్లూరుజిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్లు చేయించే ముఠాలపై నిఘా పెట్టామని జిల్లా రిజిస్ట్రార్ ఎం.అబ్రహం తెలిపారు. నెల్లూరు ఆర్‌వో, స్టోన్‌హౌస్‌పేట, కావలి, వింజమూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడుతున్న నలుగురిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు పెట్టినట్లు తెలిపారు. మరో పదిమంది అక్రమ రిజిస్ట్రేషన్ల ముఠాలను గుర్తించి విచారిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఇలాంటి ముఠాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఎవరైనా వచ్చి మీ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయిస్తామంటూ మోసపూరిత మాటలు చెబితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తెలియజేయాలన్నారు.

## • తడ

# అక్రమ వసూళ్లతో దడ...



***జిల్లా పోలీసు శాఖలో ఎస్ఐలైనా, కానిస్టేబుళ్లయినా ముందుగా పోస్టింగ్ కోరుకునే ప్రాంతం తడ పోలీసుస్టేషన్. ఆంధ్రప్రదేశ్‌కు దక్షిణం వైపున వున్న చివరి పోలీస్‌స్టేషన్ ఇది. తమిళనాడుకు సరిహద్దు. ఎవరన్నా నెల్లూరు టౌన్‌లో పోస్టింగ్ కోరుకుంటారు. కాని పోలీసుశాఖలో మాత్రం చాలామంది మొదటి ప్రాధాన్యత తడకే! ఇక్కడ పోస్టింగ్ కూడా ఊరకే రాదు. మంత్రి నుండి అధికారుల వరకు లక్షలకు లక్షలు లంచాలు ముట్టజెబితేనే ఇక్కడ పోస్టింగ్ ఇస్తారు. ఇది అనధికారికంగా జరిగిపోతుంది కాబట్టి సరిపోతుందిగాని, తడలో పోస్టింగ్‌లకు అధికారికంగా వేలంపాట పెడితే ఆదాయం కోట్లలో వుంటుంది. ఈ స్టేషన్‌కు ఎందుకయ్యా ఇంత గిరాకీ అంటే... ఇది సరిహద్దు కావడం, మామూళ్ల స్థాయి ఎక్కువుగా ఉండడం. పగలు సెటిల్‌మెంట్లు, రాత్రిళ్లు దండకాలు... ఇదీ తడ పోలీస్‌స్టేషన్ పరిస్థితి.***

ఆంధ్రా నుండి చెన్నైకి పెద్ద ఎత్తున ఇసుక అక్రమరవాణా జరుగుతోంది. ఒక్కో ఇసుక లారీకి నెలకు 10వేలు ఇచ్చుకోవాలి. ట్రాక్టర్‌కైతే నెల మామూలు 7వేలు. ఇక ప్రతి ఇసుక ట్రిప్‌కు 2వేలు ఇచ్చుకోవాలి. ఇక చెన్నైకు తిరిగే జాక్‌పాట్ లారీలు 130 దాకా వున్నాయి. వాటి నుండి అందే నెలమామూళ్ళు 50వేల రూపాయల దాకా ఉన్నాయి. ఇక ప్రతి బ్రాందీషాపు నుండి నెలకు 8వేల రూపాయలు మామూలు ఉంటుంది. తడ ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువుగా వస్తున్నాయి. ప్రతి పరిశ్రమ యాజమాన్యానికి ఏదో ఒక సందర్భంలో పోలీసులతో పని పడుతుంది. కాబట్టి పరిశ్రమల వాళ్లకూ ఈ మామూళ్ల బెడద తప్పడం లేదు. రొటీన్‌గా తిరిగే లారీల నుండి దండకాలు మామూలే! చీకటి పడితే చాలు స్టేషన్ ఎదురుగా రోడ్డుపైనే వాహనాలను ఆపి వసూళ్లకు పాల్పడుతుంటారనే ఆరోపణలున్నాయి. మామూళ్ల మత్తులో పడి పోలీసులు శాంతిభద్రతలను మరిస్తే ఇక్కడ చాలా ప్రమాదమే. ఇటీవల చెన్నై కేంద్రంగా జరిగిన పలు ఉగ్రచర్యలకు సంబంధించి తడ వార్తల్లోకి ఎక్కింది. అనుమానిత ఉగ్రవాదులు తడలో సంచరిస్తున్నారనే సమాచారంతో జిల్లా పోలీసులు అప్రమత్తం కావడం తెలిసిందే! దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీ సెజ్ ఇక్కడ వుంది. ఇక అంతరిక్ష పరిశోధనా కేంద్రం దగ్గరలోనే వుంది. అపరిచిత వ్యక్తుల సంచారం ఇటీవల ఈ ప్రాంతంలో ఎక్కువుగా ఉంటోంది. పరిశ్రమలలో పని చేయడానికి ఎక్కడెక్కడి ప్రాంతాలవారో వస్తున్నారు. వారిపై నిఘా ఉంచాల్సిన అవసరంవుంది. చేయాల్సిన ఇటువంటి పనులను వదిలేసి కేవలం వసూళ్లపైనే తడ పోలీసులు దృష్టి పెడుతున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

సింహపురి సమాచారం

## శ్రీ వెంకటేశ్వర కాలేజీ...

# మంచి విద్యతో ముందడుగు వేస్తుంది



కొడవలూరు మండలం నార్త్‌రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో టాటా ఐఆర్ఎం ప్రాజెక్ట్‌ను ఫిబ్రవరి 27వ తేదీన రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్ ప్రారంభించారు. ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే సాయికృష్ణయాచేంద్ర, కాలేజీ ఛైర్మెన్ పెనుబర్తి బాబునాయుడు, డైరెక్టర్ పట్టాభి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, సిండికేట్ బ్యాంకు చీఫ్‌మేనేజర్ పి.కృష్ణ, టాటా కన్సెల్టెన్సీ సౌత్‌మేనేజర్ గోపాల్‌రాజ్‌పుత్, ఆంధ్రా బ్యాంక్ డిజిఎం కెపిఎస్‌వి రమణమూర్తి, ప్రిన్సిపాల్ బి.దత్తాత్రేయశర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలేజీని స్థాపించిన అనతికాలంలోనే ఏ గ్రేడ్ తీసుకొచ్చిన యాజమాన్యం కృషిని సిఎం రమేష్ అభినందించారు

## సిఆర్ మార్ట్‌లో

# మెగా రక్తదాన శిబిరం

గూడూరు పట్టణం కోనేటిమిట్టలో వున్న సిఆర్ మార్ట్‌లో మంగళవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. డాక్టర్ సిఆర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, సిఆర్ రెడ్డి ఆసుపత్రివారి ఆధ్వర్యంలో, ప్రాంతీయ వైద్యశాల వారి సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. సబ్ కలెక్టర్ గిరీషా ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు సిఆర్‌రెడ్డి సేవా తత్పరతను కొనియాడారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని గూడూరు బ్లడ్‌బ్యాంక్‌కు అందజేస్తామని శిబిరం నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిఆర్ రెడ్డి, డాక్టర్ సి. జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి. రోహిణి, వైకాపా నాయకులు వై.గోపాలరెడ్డి, ప్రాంతీయ వైద్యశాల వైద్యులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


**FORM IV**
(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 2. Periodicity of its Publication | : | Weekly |
| 3. Printer's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. Publisher's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. Editor's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)
01.03.2016 SIVA PRABHATH REDDY.T

## వ్యాపార, రాజకీయ దిగ్గజాల సాక్షిగా

# సెంబ్‌కార్ప్ గాయత్రిల సంబరం



*ఈ రాష్ట్రంలోనే కాదు వారంతా దేశంలోనే ప్రముఖులు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అసామాన్యులు. అలాంటి అరుదైన వారినందరినీ ఓ వేదికపైకి చేర్చాడు సుబ్బరామిరెడ్డి. సుమారు రెండు గంటల పాటు వారంతా వేదికపై నుండి కదలకుండా కూర్చోబెట్టాడు కూడా. ఇది అందరికీ సాధ్యం కాదు. ఒక్క సుబ్బరామిరెడ్డికే సాధ్యం. వ్యాపార రంగమైనా, రాజకీయ రంగమైనా, కళా రంగమైనా, సాహితీ రంగమైనా, ఆధ్యాత్మిక రంగమైనా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వ్యక్తులను ప్రత్యేక విమానాల్లోనూ హెలికాప్టర్లలోనూ రప్పించి వారిని మెప్పించాలంటే అది టియస్ఆర్‌కే చెల్లు. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్టణం వంటి మహానగరాలకే కాదు నేలటూరు వంటి మారుమూల ప్రాంతానికి కూడా తాననుకుంటే మహామహులను రప్పించగలనని మరోసారి రుజువు చేసుకున్నాడు ఈ 'కళాబంధు'.*



ఫిబ్రవరి 27వ తేదీ శనివారం ఉదయం 9గంటల నుండే సెంబ్‌కార్ప్ గాయత్రి విద్యుత్ ఉత్పాదక కర్మాగార ప్రాంగణానికి అతిథులు రావడం ప్రారంభించారు. సుమారు 11.30గంటలకు ప్రారంభోత్సవ వేడుక వుండవచ్చున్న అభిప్రాయంతో ఉదయం నుండే అతిథులు రావడం వారికి కేటాయించిన సీట్లలో ఆశీనులు కావడం జరిగింది. నలుగురు కేంద్ర మంత్రులు ఒక ముఖ్యమంత్రి మరో సింగపూర్ మంత్రితో ముడిపడిన కార్యక్రమం కావడంతో ముందుగా అనుకున్న సమయానికన్నా రెండు గంటలు ఆలస్యంగా సుమారు 1.30గంటల సమయంలో ప్రారంభోత్సవ వేడుక మొదలయ్యింది.

వేడుక కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎయిర్ కండిషన్డ్ భారీ టెంట్‌లో నిర్మించిన అతి భారీ వేదికపైన ఒకేసారి 50మంది వరుసగా కూర్చోగలిగేలా కుర్చీలు ఏర్పాటు చేశారు. వేడుక ప్రారంభమయ్యే వరకూ సెంబ్‌కార్ప్ గాయత్రి ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను స్టేజీకి వెనుకవైపు ఏర్పాటు చేసిన అతిపెద్ద డిజిటల్ స్క్రీన్‌లో ప్రదర్శించారు.

9గంటల నుండి వచ్చిన అతిథులందరికీ సుబ్బరామిరెడ్డి, ఆయన కుమారుడు సందీప్‌రెడ్డి స్వయంగా స్వాగతం పలికారు.

సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభ దాదాపు రెండుగంటల సేపు జరగడం విశేషం. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడితో పాటు ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మరో ముగ్గురు కేంద్రమంత్రులు పియూష్‌గోయల్, ప్రకాష్ జవదేకర్, సుజనాచౌదరి, సింగపూర్ మంత్రి ఈశ్వరన్, సెంబ్‌కార్ప్ ఛైర్మెన్ అంగ్‌కాంగ్ హ్యా, సెంబ్‌కార్ప్ గ్రూప్ సిఇఓ టాంగ్‌కిన్‌షిలు ప్రధాన అతిథులుగా వేదికపై ఆశీనులు కాగా, వ్యాపార దిగ్గజాలు, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఛైర్మెన్ ప్రతాప్ సి రెడ్డి, ఎస్సార్ గ్రూప్ ఛైర్మెన్ శశిరూయా, జివికె సంస్థల ఛైర్మెన్ జి.వి.కె.రెడ్డి, జి.యం.ఆర్ అధినేత గ్రంధి మల్లిఖార్జునరావు, నాస్కామ్ ఛైర్మెన్ బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి, గాయత్రి వైస్‌ఛైర్మెన్ బ్రిజ్ మోహనరెడ్డి, జి.వి.కె సంస్థల వైస్‌ఛైర్మెన్ జి.వి.సంజయ్‌రెడ్డి, విపిఆర్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌సిసి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ ఎ.వి.వి.రంగరాజులతో పాటుగా గాయత్రి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ తిక్కవరపు సందీప్‌రెడ్డి ముఖ్యఅతిథులుగాను, రాష్ట్ర మంత్రులు, యం.యల్.ఏలు, యం.పి.లు, జడ్పీ ఛైర్మెన్, మాజీ నాయకులు ప్రత్యేక ఆహ్వానితులుగానూ వేదికనలంకరించారు.

ఇదే వేదికపై నుండి రిమోట్ కంట్రోల్ ద్వారా సంస్థను ప్రారంభించిన ముఖ్యమంత్రి, అంతకుముందు జరిగిన జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నాడు. ముందుగా స్వాగతోపన్యాసం చేసిన సందీప్‌రెడ్డి తమ సంస్థ సెంబ్‌కార్ప్‌తో కలిసి చేపట్టిన ప్రతిష్టాత్మక పవర్ ప్రాజెక్ట్ వివరాలను సభకు తెలియజేశాడు.

అధ్యక్షోపన్యాసంలో తిక్కవరపు సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ సింగపూర్‌తో భారత దేశానికి వున్న 50సంవత్సరాల స్నేహ బాంధవ్యాలకు గుర్తుగా ఈ సెంబ్‌కార్ప్ గాయత్రిల మెగా పవర్ ప్రాజెక్ట్‌ను అందిస్తున్నామని, దాదాపు 20వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ప్రారంభించిన ఈ సంస్థను భవిష్యత్‌లో మరో 10వేల కోట్ల రూపాయలతో విస్తరిస్తామని చెప్పారు. తన ఆహ్వానాన్ని మన్నించి ఎంతో శ్రమతో ప్రారంభోత్సవ సంబరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపాడు. తాను కాని, జి.వి.కె.రెడ్డి కాని ఇలా నెల్లూరీయులెవరైనా సంచలనాలకు సారధులుగా వుంటున్నారంటే అందుకు కారణం నెల్లూరు నేల, నెల్లూరు పెన్న నీళ్ళు, నెల్లూరు బియ్యం అని అంటూ నెల్లూరోళ్ళు ఎక్కడున్నా తమ వునికిని చాటుకుంటారని సంచలనాలకు సారధులుగా నిలుస్తారని సుబ్బరామిరెడ్డి అన్నారు. సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్, సింగపూర్, గాయత్రి గ్రూప్ ఇండియా కలసి జాయింట్ వెంచర్ క్రింద అభివృద్ధి చేసిన ఈ విద్యుత్ ఉత్పాదక ప్రాంగణం ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా గాయత్రి సంస్థల చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు.



కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు తన ప్రసంగంలో సుబ్బరామిరెడ్డి ప్రతిభాపాటవాలను ఆకాశానికెత్తేశాడు. ఆయన ఏ పని చేసినా అది సంచలనంగానే వుంటుందని అన్నాడు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా "సాగర్ మాల" ద్వారా పోర్టులకు పెద్దపీట వేస్తున్నారని, కృష్ణపట్నం వంటి పోర్టు ద్వారా భవిష్యత్తులో నెల్లూరు ఎంతో అభివృద్ధిని సాధిస్తుందనడానికి జిల్లాకు వస్తున్న పరిశ్రమలే పెద్ద నిదర్శనమని అన్నారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరినీ కలుపుకు పోవడంలో సుబ్బరామిరెడ్డి దిట్ట అని, రాజధాని అభివృద్ధికి కూడా సింగపూర్ ముందుకు రావడం అభినందనీయమని, సింగపూర్ కంపెనీతో చేతులుకలిపి వారి భాగస్వామ్యంతో గాయత్రి సంస్థ పని చేయడం ఆనందదాయకమని అన్నారు. అన్ని రంగాల వారిని ఒక్క చోటుకు చేర్చడం వారందరిని తాను చేసే కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేయడం సుబ్బరామిరెడ్డికే సాధ్యమని అన్నారు.

ఇదే సభలో సింగపూర్ మంత్రి ఈశ్వరన్, కేంద్ర మంత్రులు ప్రకాష్ జవదేకర్, పియూష్‌గోయల్, పారిశ్రామికవేత్తలు పి.సి.రెడ్డి, జి.వి.కృష్ణారెడ్డి, జి.యం.రావులు ప్రసంగించారు. మాట్లాడిన వారందరూ టి.యస్.ఆర్ శక్తిసామర్థ్యాల గురించి ఆయన చేపట్టే కార్యక్రమాల గురించి ప్రస్తావించి అభినందించారు. 50సంవత్సరాల సుదీర్ఘ స్నేహబంధానికి చిహ్నంగా సింగపూర్ భారతదేశ ప్రతినిధులు పరస్పరం ఒకరినొకరు సత్కరించుకుని జ్ఞాపికలను అందజేసుకున్నారు. దేశ నలుమూలల నుండి పారిశ్రామిక దిగ్గజాలతో పాటు రాజకీయ ఉద్ధండులని రప్పించిన సుబ్బరామిరెడ్డి వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వారి చెంతనే ఉంటూ స్వయంగా పర్యవేక్షించారు.

హైదరాబాద్ నుండి ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక విమానాల్లో అనేకమంది సుబ్బ రామిరెడ్డి కుటుంబసభ్యులు, మిత్రులు, ఆప్తులు, ఆత్మీయులు రేణిగుంటకు వచ్చి అక్కడ నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్లలోనూ, ఓల్వో బస్సుల్లోను, హెలికాప్టర్ల లోను కార్యక్రమ ప్రాంగణానికి తరలి వచ్చారు. మహానగరాల కార్యక్రమాలను తలపించే స్థాయిలో చేసిన సభా ఏర్పాట్లను (మిగతా 11వ పేజీలో)











# 'ప్రభా'తం

అనుకున్నట్లుగానే..దేశంలోని జనమంతా ఆశించినట్లుగానే ఈసారి బడ్జెట్ మోడీ మార్క్ బడ్జెట్ గా ముద్ర వేసుకుంది. ప్రజలకు ఈ బడ్జెట్ మంచి భరోసా ఇచ్చేదిగానే రూపొందింది. ముఖ్యంగా రైతులకు, పేదలకు, అనేక రంగాల ప్రగతికి బడ్జెట్ కేటాయింపులు బలంగానే వున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ప్రధాని మోడీ మనసుకు తగ్గట్లుగానే బడ్జెట్ రూపకల్పన జరిగినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. దేశ ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2016-17 సంవత్సరానికి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ అంకెల గారడీగా కాక, ప్రజలకు ఊరటనిచ్చే మంచి బడ్జెట్‌గా వుండడం ఎంతైనా సంతోషకరం.

దేశప్రగతికి అవసరమైన, ఎంతో కీలకమైన ప్రాధాన్యతా రంగాలకు కూడా అంత ప్రాధాన్యత ఇవ్వకుండా, నామమాత్రపు బడ్జెట్ కేటాయింపులతో పలు రంగాలకు నిరాశా నిస్పృహలనే మిగిలిస్తూ వచ్చిన గత పాలకుల బడ్జెట్‌ల కంటే ఈ బడ్జెట్ ఎంతో భిన్నంగానే వుందనే చెప్పవచ్చు. దేశప్రగతిని వేగవంతం చేయాలనే తపన ఈ బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తుండడంతో కొత్త పథకాలు, సరికొత్త ఆలోచనల కలయికగా వున్న ఈ బడ్జెట్ అన్నివర్గాలవారినీ బాగానే ఆకట్టుకుంది. దేశ ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలైన కీలక రంగాలపై దృష్టిపెట్టి, ఆయా రంగాల అభివృద్ధి ద్వారానే దేశపురోగతి సాధ్యమవుతుందనే లక్ష్యంతో ప్రాధాన్యతారంగాలకు ఇంతగా భారీ బడ్జెట్ కేటాయింపులు జరగడం బహుశా ఇదే ప్రథమం కావచ్చు. నవభారత్ నవనవోన్మేషం కావాలంటే అందుకు మూలస్తంభాలైన తొమ్మిది రంగాలు..వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సామాజిక, ఆరోగ్యరంగాలు, విద్య -మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఆర్థిక రంగంలో సంస్కరణలు, పాలనా సంస్కరణలు, ద్రవ్య క్రమశిక్షణలకు బడ్జెట్‌లో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం అవసరం. ఈ బడ్జెట్‌లో అదే జరిగింది. వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో వ్యవసాయాన్ని నమ్ముకున్న అన్నదాతలకు ఊరటనిచ్చేవిధంగా ఈ బడ్జెట్‌లో మంచి ప్రాధాన్యత ఇచ్చారు. దేశానికి ఆహారభద్రత, రైతుకు ఆదాయ భద్రత అనేవిధంగా వ్యవసాయరంగానికి, రైతు సంక్షేమానికి 35,984 కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించడం, గ్రామీణ భారతాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు, పల్లెల ప్రగతితో భారత్ కళకళలాడేందుకు భారీగా నిధులు కేటాయించడం సముచితం. మొత్తంగా 19 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ పెట్టుబడిలో గ్రామీణాభివృద్ధికి 87,765 కోట్లు కేటాయించి పల్లెల ప్రగతికి సరికొత్త దారులు వేసేందుకు నిర్ణయించడం ఎంతైనా హర్షణీయం. వ్యవసాయం, రైతుల సంక్షేమమే ధ్యేయంగా తొలి ప్రాధాన్యతగా వ్యవసాయ రంగాన్ని ఎంపిక చేసుకోవడంలోనే ప్రధాని మోడీ తన ప్రత్యేకతను చాటుకున్నారు. రైతులకు సకాలంలో తగినంతమేరకు రుణాలనందిస్తే వారి అభ్యున్నతికి దారితీసినట్లవుతుంది కనుక, రైతులకు ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 9 లక్షల కోట్లను రుణాలుగా ఇవ్వాలని నిర్ణయించడం, వడ్డీ భారం లేకుండా రాయితీ ఇచ్చేందుకు 15 వేల కోట్లను కూడా కేటాయించ డంతో దేశవ్యాప్తంగా రైతాంగంలో హర్షం వ్యక్తమవుతోంది. రైతుల రుణాల కోసం భారీగా నిధుల కేటాయింపు, సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం అందించడం, పాడిరైతులకు ప్రత్యేక పథకాలతో ఉత్సాహమందించడం వంటివన్నీ మోడీ ఆకాంక్షల జాబితాలోవేనని వేరే చెప్పనక్కర లేదు. ఇప్పుడు నాటుతున్న ఈ అభివృద్ధి మొక్కల ఫలాలను భవిష్యత్తులో రైతన్నలు అందుకునే విధంగా ఎంతో శ్రద్ధతో ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఎవరికైనా అర్థమవుతుంది.

'పల్లెల ప్రగతితోనే దేశ పురోగతి' అనేది కేవలం నినాదమాత్రంగానే మిగిలిపోయిన నేటి పరిస్థితుల్లో పల్లెప్రజల అభ్యున్నతిని కాంక్షిస్తూ భారీ బడ్జెట్ కేటాయించడం సంతోషకరం. అదేవిధంగా, ఉపాధి హామీ పథకానికి 38,500 కోట్లు, సాగునీటికి ఇబ్బంది లేకుండా భూగర్భజల వనరులు పెంచుకునేందుకు 87,765 కోట్లు కేటాయించడం, నిధుల కొరతతో ఆగిపోయివున్న 89 సాగునీటి వనరుల ప్రాజెక్టులను పూర్తిచేయడానికి కూడా నిధులు కేటాయించడం వంటివి సాగునీటి రంగానికి సరికొత్త ఊతమిస్తాయి. రానున్న అయిదేళ్లలో కృషి సించాయ్ యోజన పథకం కింద 70 లక్షల ఎకరాలకు పైగానే అదనంగా సాగునీరు అందించే సంకల్పం ఎంతైనా మంచిదే. అంతేకాదు, ప్రధాని మోడీ మానసపుత్రికలైన మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్వచ్ఛభారత్, ముద్రా బ్యాంకింగ్ వంటి పథకాలకు కొత్త ఊపుని ఉత్సాహాన్ని ఇచ్చారు. ప్రత్యేకించి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న స్వచ్ఛభారత్‌కు ఈ బడ్జెట్‌లో 9వేల కోట్లు కేటాయించడం, ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రధానమైన పారిశుధ్య పరిరక్షణకు ఇలా భారీగా నిధులు కేటాయించడం కూడా దేశంలో ఇదే ప్రథమమనే చెప్పవచ్చు. ఇటు దేశ ఆర్థికవృద్ధికి అవరోధం లేకుండా, అటు ప్రజల ప్రగతికి అడ్డంకులు లేకుండా ఆచితూచి బడ్జెట్ కేటాయించారని భావించవచ్చు. ప్రజలపై కొత్త పన్నుల బాదుడు లేకుండా, పల్లెల ప్రగతికీ, పేదలు-రైతుల సంక్షేమానికి సరికొత్త మార్గాలు వేయడం ద్వారా కొత్త బడ్జెట్ మంచి మార్కులు కొట్టేసిందనే చెప్పవచ్చు.

సాధారణంగా బడ్జెట్ అన్న తర్వాత హెచ్చింపులు, తగ్గింపులు ఉంటూనే వుంటాయి. ఎంతచేసినా ఇంకా చేయాల్సింది ఎంతో మిగిలే వుంటుంది. ఉన్నంతలో.. చేయగలిగినంతలో దేశాభివృద్ధికి ఎంతగా దోహదం చేయగలిగారన్నదే ముఖ్యం. ఆ మేరకే కాదు.. అవసరమైనంత మేరకు ఈ బడ్జెట్‌లో అనేకరంగాలకు మంచి కేటాయింపులు జరిగాయనే అనుకోవచ్చు. అయితే, మనరాష్ట్రానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టుకు భారీనిధులు కేటాయించివుంటే బావుండేది. అరాకొర కేటాయింపులే రావడమే బాధాకరం. ఆ లోటును కూడా కేంద్రం త్వరలో తీర్చగలిగితే సాగునీటి రంగానికి మరింత సాయం అందించినట్లవుతుంది. ఏదేమైనా, దేశం ఇప్పుడిప్పుడే ఆర్థికంగా వృద్ధిని సాధిస్తున్న దశలో.. తాజా బడ్జెట్.. మోడీ మానస బడ్జెట్.. అందరూ నచ్చదగినదే.. మెచ్చదగినదేననడంలో ఎలాంటి సందేహం లేదు.

## భరోసా బడ్జెట్



దేశ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ 2016-17 సంవత్సరానికి ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ అంకెల గారడీగా కాక, ప్రజలకు ఊరటనిచ్చే మంచి బడ్జెట్‌గా వుండడం ఎంతైనా సంతోషకరం. వ్యవసాయం, గ్రామీణాభ్యున్నతి వంటి ప్రాధాన్యతా రంగాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దేశప్రగతిని వేగవంతం చేయాలనే తపన ఈ బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. కొత్త పథకాలు, సరికొత్త ఆలోచనల కలయికగా వున్న ఈ బడ్జెట్.. మోడీ మార్క్ బడ్జెట్‌గా.. అన్ని వర్గాలవారినీ బాగానే ఆకట్టుకుంది.

## చిన్నారుల లీప్ నృత్యాలు

నెల్లూరు సంస్కృతి తరంగాలు ట్రస్టు ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలు జూనియర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారకభవనం ఏసి హాలులో సోమవారం రాత్రి నిర్వహించిన శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. 33సంవత్సరాలకు ఒకసారి వచ్చే శాస్త్రీయమైన అద్భుతం ఫిబ్రవరి నెలలో అయిదు సోమవారాలు వచ్చినందున సంస్కృతి శాస్త్రం దృష్ట్యా మరపురాని ప్రత్యేక దినంగా భావించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రస్టు వ్యవస్థాపకులు రేణిగుంట రాజశేఖర్ తెలిపారు. అంతేకాకుండా తమ పిల్లలు తల్లిదండ్రులకు బహుమతి ఇచ్చేరోజుగా గుర్తింపుబడిందన్నారు. అనంతరం ప్రత్యేకంగా బేబి రేణిగుంట సుమేథ "మహాప్రాణదీపం" అనే గీతానికి హూప్‌తో చేసిన నృత్యం, మహిషాసుర నృత్య ప్రదర్శన ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకున్నాయి. రేవతి, హర్షితకృష్ణ, సాయిహ్రుతికకృష్ణ, లాస్య, భావన, మౌనిక, ఆశ్రిత, సహస్ర, యశస్విని నృత్యప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సి. మునికుమార్, వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, బి.వి.నరసింహం, నరశింహారావు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## కామాక్షమ్మ హుండీ ఆదాయం రూ.34లక్షలు

బుచ్చి మండలం జొన్నవాడ గ్రామంలో వెలసియున్న శ్రీ మల్లికార్జున సమేత కామక్షమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం హుండీలను లెక్కించారు. గతఏడాది నవంబర్2 నుంచి ఫిబ్రవరి29 సోమవారం వరకు రూ.34,04,919లు ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ కార్యాలయం పర్యవేక్షకురాలు ఉష, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాలకు స్తంభ ప్రతిష్ఠ

నెల్లూరు దర్గామిట్టలో వున్న శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలోని మీనాక్షి సమేత శ్రీ సుందరేశ్వరస్వామి మందిరంలో శివరాత్రి ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగే ఈ వేడుకలకు ప్రారంభసూచకంగా ఎంతో భక్తిశ్రద్ధలతో ఆదివారం స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో శ్రీ సుందరేశ్వరస్వామికి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, నవావరణ పూజలతో, వేదమంత్రాల మధ్య మంగళవాద్యాల మధ్య స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ రత్నం జయరాం దంపతులు, ఉభయదాత ఆల్తూరి ఆది నారాయణరెడ్డి దంపతులు, ఆలయ ఇ.ఓ కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## గిన్నిస్‌బుక్‌లో చంద్రబాబు

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రుల్లో వేలికి ఉంగరం, చేతికి వాచి, పాకెట్ మనీ లేని నిరుపేద ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కడే అంటే అతిశయోక్తి కాదు! అంచేత చంద్రబాబు పేరు నిరుపేద ముఖ్యమంత్రిగా గిన్నిస్‌బుక్‌లో ఎక్కడం ఎంతైనా సమంజసం! అంతేకాదు, చంద్రబాబుకు భారతరత్న అవార్డు ఇవ్వాలి. – కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## ఈ పనెప్పుడో చేసుండాలి!

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం అభినందనీయం. అయితే ఈ పని ఎప్పుడో చేసుండాలి. ఓ పక్క పనికిమాలిన సంక్షేమ పథకాలకు వేలకోట్లు తగలేస్తూ, ఇసుకను అన్ని వర్గాల ప్రజలకు అందకుండా చేశారు. ఇసుక మాఫియా కోట్లకు పడగలెత్తింది. ఇప్పుడైనా ఇసుక విధానాన్ని మార్చడం సంతోషకరం.

డి.వి.సుధాకర్, నెల్లూరు.

## కాస్తైనా సిగ్గుండాలి

లౌకికవాదం గురించి గొంతు వాసిపోయేలా మాట్లాడే కాంగ్రెస్, వామపక్షాల నాయకులకు ఇంకొకరి మనోభావాలను గౌరవించాలనే ఇంగితజ్ఞానం లేదా? జెఎన్‌యు విద్యార్థులు దుర్గాదేవిపై అసభ్యకర వ్రాతలు వ్రాస్తే, అది భావప్రకటనా స్వాతంత్ర్యం అంటూ సీతారాం ఏచూరి వంటి కుహనా మేధావులు వెనకేసుకు రావడం ఏమిటి? రేపు వీళ్ళ ఇళ్ళల్లో వారి మీద కూడా అలాగే వ్రాసి అది కూడా భావప్రకటనా స్వాతంత్ర్యం అంటే సరిపోతుందా? మాట్లాడేదానికి కొంచెమన్నా సిగ్గుండాలి.

సి.రాజీవి, నెల్లూరు.

## రిజర్వేషన్ల భారతం

మన ప్రజాస్వామ్య దేశం రిజర్వేషన్ల పోరాటాలతో వర్ధిల్లుతోంది. హరిజనుల నుండి అయ్యవార్ల వరకు రిజర్వేషన్లపై చర్చలు జరుపుతున్నారు. రాజకీయ నాయకులు వ్యవస్థను చెడగొడుతున్నారు. ప్రశాంతంగా వున్న దేశాన్ని రాజ్యాంగ పరంగా అవహేళన చేస్తున్నారు. జాట్‌లు, పటేల్‌లు, కాపులు కూడా రిజర్వేషన్లు కోరుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికే రిజర్వేషన్లుండాలి. ఆర్థికంగా స్థిరపడ్డవాళ్ళు రిజర్వేషన్లు తీసుకోవడం అవమానంగా భావించాలి. లేదంటే దేశంలోని అన్ని కులాలు డిమాండ్ చేస్తున్నట్లు రిజర్వేషన్లు పెంచితే అవి 200శాతానికి చేరుకుంటాయి. అసలు కులానికి రిజర్వేషన్ సంబంధం ఏమిటో అర్థమేకాదు. అన్ని కులాల్లోను ఆర్థిక ఇబ్బందులున్న వారు ఉన్నారు. సంపన్నులున్నారు. ముఖ్యంగా ఈ రిజర్వేషన్ల వల్ల మేధావులు పక్క దేశాలకు తరలిపోతున్నారు. మన దేశంలో మేధస్సుకు విలువే లేకుండా పోతోంది. – వాస్తు రామచంద్ర, నెల్లూరు.

# దేశమంతా నెల్లూరు కాంతులు

అభివృద్ధికి నెల్లూరు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని, దేశమంతా వెలుగులు నింపే ఎన్నో వేల మెగావాట్ల విద్యుత్ కేంద్రాలకు నెల్లూరుజిల్లా నెలవైందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు కేంద్రమంత్రులు, సింగపూర్ మంత్రి అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 27వ తేదీన ముత్తుకూరు మండలం నేలటూరులోని దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలోని 1600 మెగావాట్ల యూనిట్లను జాతికి అంకితం చేసే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు కేంద్ర మంత్రులు యం.వెంకయ్యనాయుడు, పియూష్ గోయల్, ప్రకాశ్‌జవదేకర్, సుజనాచౌదరి, సింగపూర్ మంత్రి ఈశ్వరన్, రాష్ట్ర మంత్రులు శిద్దా రాఘవరావు, పి.నారాయణలు పాల్గొన్నారు. అలాగే ఇక్కడే మరో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా నిర్వహించారు. 2014ఎన్నికల నాటి నుండి కూడా ఇక్కడ సీట్లు తక్కువ వచ్చాయని చెప్పి నెల్లూరంటే చిటపటలాడే చంద్రబాబు ఈ సభలో మాత్రం నెల్లూరుజిల్లాను కీర్తించాడు. దేశంలోనే నెల్లూరుజిల్లా పవర్‌హౌస్‌గా మారుతోందని చెప్పాడు. ఇక్కడ జనం నెత్తిన పడే బూడిద గురించి మాత్రం ఆయన చెప్పలేదు. పెన్నా నీళ్ల మహత్యం ఏమోగాని, ఇక్కడ పుట్టిన వాళ్లంతా గొప్పోళ్లవుతున్నారని, రాజకీయ, పారిశ్రామిక రంగాలలో రాణిస్తున్నారని, నెల్లూరీయులకు తెలివితో పాటు డబ్బు కూడా ఎక్కువేనని పొగుడుతూ ఆ చేత్తోనే అమరావతి రాజధాని నిర్మాణానికి విరాళాలివ్వాలంటూ టెండర్ పెట్టారు. కృష్ణపట్నం పోర్టు ద్వారా జిల్లాకు ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయని, నెల్లూరు, చెన్నై, తిరుపతిలు ట్రైపారిశ్రామిక నగరాలుగా అభివృద్ధి చెందనున్నాయని చెప్పారు. ఇక కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు మాతృభూమి, మాతృభాష, పుట్టిన నేల, పీల్చిన గాలి, చదివిన బడి, మొక్కిన గుడి గురించి బాగానే చెప్పారు. నెల్లూరుజిల్లా అతిపెద్ద పారిశ్రామిక కేంద్రం కాబోతోందన్నారు. నెల్లూరులోని రోటరీ క్లబ్ శ్మశానవాటికలో విద్యుత్ వెలుగుల కోసం రాజ్యసభ నిధుల నుండి కోటిరూపాయలు విడుదల చేస్తున్నట్లు ఈ సభలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి పేర్కొన్నాడు. సెంబ్‌కార్ప్ – గాయత్రి పవర్ కాంప్లెక్స్ సిఎస్ఆర్ నిధులతో ఈ ప్రాంతంలోని గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావు, మంత్రులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పరసా రత్నం, టి.రమేష్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, బీజేపీ నాయకులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, మేయర్ అజీజ్, కలెక్టర్ ఎం.జానకి, జెన్‌కో సిఎండి విజయానంద్, ఇన్‌ఛార్జ్ ఎస్పీ శ్రీకాంత్ పాల్గొన్నారు.



దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని జాతికి అంకితం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

## కాంట్రాక్టర్ల కళ్లలో.. ఇసుక కొట్టారు!

**నెల్లూరులో నెలరోజులు హడావిడి... ఇసుక టెండర్ల టెన్షన్... టెండర్లు వేయడానికి డబ్బులు తేవాలిగా... అప్పుల కోసం పరుగులు.. వడ్డీ వ్యాపారుల వద్ద బేరసారాలు... బ్రతిమలాడి భంగపడి అప్పులు తెచ్చుకుని టెండర్లు వేశారు. నాయకులతో ఒప్పందాలు... రీచ్‌లు వస్తే స్థానిక నేతలకు వాటాలు... కాంట్రాక్టర్లు పోటీలు పడి ఎక్కువ ధరకు కోట్ చేయకుండా సిండికేట్‌లు కట్టడం.. పోటీ నుండి తప్పుకున్న కాంట్రాక్టర్లకు గుడ్‌విల్...**

అయిపోయింది, అంతా అయిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో ఇసుక కాంట్రాక్టర్ల అంచనాలన్నీ తల్లక్రిందులయ్యాయి. ఇసుక రీచ్‌లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. విధివిధానాలు ఖరారు చేశారు. ఏ రీచ్‌లో ఎంత ఇసుక తవ్వుకోవచ్చనేది నిర్ణయించారు. ప్రభుత్వ ధరను, వినియోగదారుడికి అందించాల్సిన ధరను ఖరారు చేశారు. టెండర్లను కూడా తీసుకున్నారు. జిల్లాలో 25రీచ్‌లకు టెండర్లు ఆహ్వానించారు. కాంట్రాక్టర్లతో అధికారపార్టీ నాయకులు చేతులు కలిపారు. రీచ్‌లను తక్కువ ధరలకే దక్కించుకోవాలన్న లక్ష్యంతో కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యారు. ఈ సిండికేట్‌ల వార్త ముఖ్యమంత్రి దాకా వెళ్లింది. ఇసుక రాబడికి సిండికేట్లు గండి కొడుతున్నాయంటూ పత్రికలలోనూ వచ్చింది. చంద్రబాబు ఆలోచనలో పడ్డాడు. ఇక్కడొచ్చే ఆదాయం మహా అంటే రెండుమూడొందల కోట్లు. ఓ పక్క పుష్కరాల కని, పబ్లిసిటీ కని వేలకోట్లు తగలేస్తున్నప్పుడు ఈ ఇసుకలో వచ్చే ఆదాయం పెద్ద లెక్క కాదు, ఈ మాత్రం దానికి ఇంత బ్యాడ్ కావడమెందుకని ఆయన ఒక్క రాత్రిలోనే మనసు మార్చుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఇసుకను ఉచితంగా ప్రకటించాడు. కాంట్రాక్టర్ల కళ్లలో ఉన్నట్లుండి ఇసుకను కొట్టాడు. ఆర్థికంగా కాంట్రాక్టర్లకు నష్టమే అయినా ఈ ఉచిత ఇసుకతో సామాన్య ప్రజలతో పాటు నిర్మాణ రంగానికి మంచే జరుగనుంది.

# నెల్లూరులో 'ఆకర్ష'ణ లేనట్లేనా?

చంద్రబాబు 'ఆకర్ష్' పథకానికి నెల్లూరుజిల్లాలోనూ కొందరు వైకాపా ఎమ్మెల్యేలు ఆకర్షితులవుతున్నారని, త్వరలోనే ఇద్దరు లేదా ముగ్గురు ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరబోతున్నారని ప్రచారం దంచేస్తున్నారు. ప్రతిపక్షంలో వుంటే ఎమ్మెల్యేలకు పనులు కాకపోవడం, సంపాదన లేకపోవడంతో పాటు, వీరిపై వున్న ఎన్నికల నాటి మద్యం కేసులను కూడా దీనికి కారణంగా చెబుతున్నారు. జిల్లా నుండి అంత అర్జంట్‌గా తెలుగుదేశంలో చేరే వైకాపా ఎమ్మెల్యేలెవరూ లేరు. జిల్లా వరకు చూస్తే అధికార ఎమ్మెల్యేలకు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు పెద్ద తేడా కనిపించదు. అధికారపార్టీలో వున్న నాయకులే కొట్టుకు ఛస్తున్నారు. ఇక వీళ్లు పోతే ఆ కొట్లాటలు ఇంకాస్త పెరగాల్సిందే! అదీగాక కాంగ్రెస్ నాయకులంతా ఇప్పుడు తెలుగుదేశంలో చేరున్నారు. వీళ్లు పోయి వాళ్లతో సర్దుకోవడం కష్టమే.

కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైకాపా జిల్లా అధ్యక్షుడిగా వున్నాడు. వైకాపా నుండి సర్వేపల్లికి అతనే లీడర్. తెలుగుదేశంలోకి పోతే ఆయన సర్వేపల్లిలోనే ఓ పక్క సోమిరెడ్డి, మరోపక్క ఆనం రామనారాయణరెడ్డితో ఇబ్బందిపడక తప్పదు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పైనా పార్టీ మారతాడనే ప్రచారం వుంది. వైకాపాలోనే సునీల్‌కు గుర్తింపు వచ్చింది. 2014 ఎన్నికల్లో గూడూరు సీటు కోసం పలువురు పోటీపడ్డా సునీల్‌కే జగన్ సీటిచ్చాడు. ఇప్పుడే కాదు రేపు కూడా గూడూరు వైకాపాకు అతనే నాయకుడు. అదే తెలుగుదేశంలోకి వెళితే ఆ గుర్తింపు కష్టమే. సూళ్లూరుపేటలో వైకాపా పట్ల ఆదరణతో పాటు సంజీవయ్య వ్యక్తిత్వం కూడా ఆయన గెలుపుకు కారణమైంది. సంజీవయ్య రాజకీయ ప్రస్థానం వైకాపాతోనే మొదలైంది. సూళ్లూరుపేట టీడీపీలో ఈరోజు బొచ్చెడుమంది నాయకులున్నారు. కాని వైసిపిలో ఉండేది సంజీవయ్య లాంటివాళ్లే! మరి తనకు ప్రాధాన్యతనిస్తున్న పార్టీని సంజీవయ్య వదలడం కష్టమే!

మిగతా జిల్లాల్లో ఎమ్మెల్యేలు ఎటుపోయినా నెల్లూరుజిల్లాలో వైకాపా ఎమ్మెల్యేలు మాత్రం 'దేశం' వైపు పోవడం అనుమానమే! తెలుగుదేశం వారి 'ఆకర్ష' ఇక్కడ వికటించే అవకాశముంది. జిల్లా వైకాపా ఎమ్మెల్యేలందరు కూడా జగన్‌ను కలిసి మేం పార్టీ మారడం లేదంటూ ప్రకటించడం గమనార్హం.

## నివాళి...



కే.బాలసుబ్రహ్మణ్యం ("మైకో"బాలు)

బాలు...

చిరునవ్వులొలికించే నీ పిలుపు
ఉత్సాహం కలిగించే నీ పలుకు
సౌరభాలు గుభాళించే నీ స్నేహం
ఇక లేవని ఇక రావని
తలుచుకుంటేనే బాధేస్తోంది.

దాదాపు 3 దశాబ్దాలుగా
నీతో పంచుకున్న స్నేహానుభూతులు
రోటరీ సభ్యుడిగా రెండు దశాబ్దాలుగా
నీతో కలసి చేసిన సేవలు
ఎన్నటికీ మరువలేనివి మరపురానివి.

నీ సేవాస్ఫూర్తిని
నీ స్నేహ దీప్తిని
స్మరించుకుంటూ

నీ స్మృతికి నా నివాళి అర్పిస్తున్నాను.

నీ
జె.వి.రెడ్డి

# పరీక్షా కాలం



మార్చి నెల... పరీక్షల సీజన్. ఇంటర్మీడియట్ పరీక్షలు అప్పుడే మొదలయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద విద్యాసంస్థల వ్యాపారం కూడా మొదలైంది. ఎంసెట్ కోచింగ్ మా వద్ద తీసు కోండంటూ కొన్ని విద్యాసంస్థలు, ఎంసెట్‌లో సీటొచ్చినా రాకున్నా మా కాలేజీలో చేరండంటూ ఇంజనీరింగ్ కాలేజీలు విద్యార్థులను కరపత్రాలు పంచి ఆహ్వానిస్తున్నాయి.

ఇక ఇంటర్మీడియట్ తర్వాత టెన్త్ క్లాస్ పరీక్షలు, తర్వాత డిగ్రీ, ఎంసెట్, పిజి... ఇక అన్ని రకాల పరీక్షలు ఈ రెండు, మూడు నెలల్లోనే ఉండబోతున్నాయి. పరీక్షలు వ్రాసే విద్యార్థులకే కాదు, వారి తల్లిదండ్రులకు కూడా ఈ పరీక్షలు ఒక అగ్నిపరీక్షే! టెన్త్ పాసయ్యాక ఇంటర్మీడియట్ ఏ కాలేజీలో చేర్పించాలనే దానిపై ఒక సంశయం... ఎంసెట్‌లో ర్యాంకు వస్తే ఏ ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించాలి... ఏ కాలేజీలో ఎంత ఫీజు తీసుకుం టున్నారు, ఎక్కడ డొనేషన్లు తక్కువగా ఉన్నాయన్న దానిపై మల్లగుల్లాలు... ఇక ఎంబిబిఎస్ సీట్ల గురించైతే చెప్పనవసరం లేదు. కాలేజీలలో వీటిని అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాలి. ఒక్కో సీటు ఖరీదు 50లక్షలకు పైమాటే! ఏ ఫ్లాట్‌ను అమ్మి ఎంబిబిఎస్ సీటు కొనాలనే దానిపై తల్లిదండ్రుల తర్జనభర్జనలు... ఈ రెండు మూడు నెలల్లోనే చదువుల పరంగా ఒక్క నెల్లూరుజిల్లాలోనే కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. ఈ రెండు నెలలు కూడా పిల్లల కంటే పెద్దలకే పరీక్షా కాలం అనుకోవచ్చు.

## నెల్లూరు కబుర్లు

## ఎస్పీని గాల్లో పెట్టారు!



జిల్లా ఎస్పీ వ్యవహారం ఇంతవరకు తేలలేదు. గత నెలలో నగరంలోని ఓ వర్గం వారితో వచ్చిన వివాదం మూలంగా ఎస్పీ గజరావు భూపాల్ విధులకు దూరంగా వుంటున్నారు. విశాఖలో జరిగిన అంతర్జాతీయ యుద్ధ నౌకల ప్రదర్శనకు వెళ్లొచ్చాక కూడా ఆయన విధుల్లో చేరలేదు. మొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనప్పుడు కూడా ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీకాంత్ ఇక్కడ ఇన్‌ఛార్జ్ ఎస్పీగా వ్యవహరించారు. ఆరోజు మైనార్టీల వివాదం పరిష్కారానికి ఎస్పీని బదిలీ చేస్తామని జిల్లా తెలుగుదేశం నాయకులు హామీ ఇచ్చారు. అయితే ఒక వర్గం ప్రజల ఒత్తిడితో బదిలీ చేస్తే అది మొత్తం పోలీసు శాఖ మీదే ప్రభావం చూపుతుంది. పోలీసులలో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. అందుకే నెల్లూరు ఎస్పీ ఒక్కడినే బదిలీ చేస్తే అది రాజకీయం అవుతుందని, ఒక వర్గం వారికి తలొంచి నట్లవుతుందని భావించిన ప్రభుత్వ పెద్దలు రాష్ట్ర వ్యాప్తంగా ఐపిఎస్‌ల బదిలీలు చేపట్టినప్పుడు నెల్లూరు ఎస్పీ బదిలీని కూడా అందులో కలిపేయాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎస్పీ గజరావ్ భూపాల్ కూడా ఇక్కడ వుండడం కంటే ఇక్కడ నుండి పోవడమే ఉత్తమమనుకుంటున్నట్లు సమాచారం.

### తెలుగు భాషాభివృద్ధికి

## ప్రభుత్వ కృషి అవసరం



తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపించి కృషి చేయాల్సిన అవసర ముందని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌర వాధ్యక్షుడు హనుమారెడ్డి అన్నారు. నెల్లూరు దర్గా మిట్టలోని అతిథి గ్రాండ్ హోటల్ సమావేశ మంది రంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చైనా, జపాన్, జర్మనీ తదితర దేశాలు తమ మాతృభాషలోనే వారి సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసుకుంటున్నాయన్నారు. ప్రధాన కార్యదర్శి చలపాక ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముద్రితమవుతున్న రచయితల పుస్తకాలను విశ్వవిద్యాలయాల సహకారంతో గ్రంథాలయాలకు పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర సంఘకార్యదర్శి చిన్ని నారాయణరావు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోసూరు రవికుమార్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, గుండాల నరేంద్రబాబు, అవ్వారు శ్రీధర్‌బాబు, ఏటూరి నాగేంఅరద, దగ్గుమాటి పద్మాకర్, ఈదూరు సుధాకర్, ఈతకోట సుబ్బారావు, బొగ్గవరపు రాధాకృష్ణ, వంజివాక సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిఎన్ఎస్ఎఫ్‌లో చేరికలు



సోమవారం నెల్లూరు లోని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో దాదాపు 200మంది విద్యార్థులు టిఎన్ఎస్ఎఫ్‌లో చేరారు. ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు కాకర్ల తిరుమలనాయుడు ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, వై.వి.రామిరెడ్డిలు వీరందరికీ పచ్చకండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు ఈ విద్యార్థులతో రామలింగాపురం జంక్షన్ నుండి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అమృల్లా, సాయికిషోర్, మోనూరాజ్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, ముర్తుజా, సాయికృష్ణ, మౌళి పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి 'స్పెల్‌బీ'కి

## రత్నం విద్యార్థులు



జాతీయ స్థాయిలో జరిగే స్పెల్‌బి పరీక్షలకు నెల్లూరు వేదాయపాలెంలోని రత్నం హైస్కూల్ విద్యార్థులు 15మంది ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ తెలిపారు. ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాల ప్రాంగణంలో అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిఎం రామ్మూర్తి నాయుడు, ప్రిన్సిపల్ మణిమాల, మేనేజర్ రఘురాం పాల్గొన్నారు.

## తిప్పావఝుల నానీల సంపుటి ఆవిష్కరణ

ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో తిప్పావఝుల సుబ్రహ్మణ్యం రచించిన 'పెన్నాతీరంలో నానీలు' పుస్తక ఆవిష్కరణ మార్చి 6వ తేదీ సాయంత్రం 4గంటలకు ఆర్‌ఎల్‌రెడ్డి స్మారక భవనంలో జరుగనుందని ఆ సంఘ అధ్యక్షులు చిన్ని నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత నానీల కవితా పఠన పోటీలు నిర్వహించబడుతాయని, మొదటి మూడు ఉత్తమ నానీలకు నగదు పురస్కారంతో పాటు సత్కారం ఉంటుందని, మరో పది ఉత్తమ నానీలకు మెమొంటోతో సత్కారం వుంటుందని, 'పెన్నా తీరంలో నానీలు' పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త డా॥ కాళిదాసు పురుషోత్తం ఆవిష్కరిస్తారన్నారు. ఈ సభలో డాక్టర్ పెళ్లకూరు జయప్రద, డాక్టర్ ఈదూరు సుధాకర్, ఈతకోట సుబ్బారావు పాల్గొంటారని పేర్కొన్నారు.

### ఆకట్టుకున్న

## సూక్ష్మ కుట్టుమిషన్



ఫిబ్రవరి 28వ తేదీ టైలర్స్ దినోత్స వాన్ని పురస్కరించుకుని నెల్లూరు జెండా వీధికి చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్వీర్ సూక్ష్మ కుట్టుమిషన్‌ను తయారు చేసి టైలర్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 800మి.గ్రా వెండి, 200మి.గ్రా చెక్కను ఉపయోగించి కుట్టుమిషన్ సూక్ష్మ నమూనాను తయారు చేసి తన బొటనవేలి గోటిపై వుంచుకుని ప్రదర్శించాడు.

## ఉచిత బిపి, షుగర్ పరీక్షలు



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు 300 మంది వాకర్స్ సభ్యులకు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డా॥ సత్యనాథ్, డా॥ శ్రీనివాసకుమార్, డా॥ దొరస్వామినాయుడు, డా॥ఎంఎస్ రెడ్డి, డా॥ నాగేశ్వరరావు, డా॥ కాశయ్యలు సహాయ సహకారాలు అందించినట్లు ఆధ్యక్షకార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు, ట్రెజరర్ పొన్నం రవిచంద్ర తెలిపారు. నలుబోలు బలరామయ్యనాయుడు, జయదేవ్, శేషగిరిరావు, హరిప్రసాద్‌రావు, డి.వి.సుబ్బరాజు, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, ఓబులురెడ్డి, స్నేహసురేష్, గఫార్‌లు పాల్గొన్నారు.

## తూ.కొ శాఖ అధికారుల దాడులు

నెల్లూరు మద్రాసుబస్టాండ్ వద్దనున్న ఏసి కూరగాయల మార్కెట్‌లోని దుకాణాలపై సోమవారం తూనికలు కొలతల శాఖ అధికారులు ఆకస్మికదాడులు నిర్వహించారు. తక్కువ తూకాలతో వినియోగదారులను మోసగిస్తున్న పలు కూరగాయల దుకాణాలలోని కాటాలను స్వాధీనం చేసుకున్నారు. తూనికలు కొలతల శాఖ ఏసి ప్రభుకుమార్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు జిల్లా ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వరరావు తెలిపారు. తక్కువ తూకం ఇస్తున్న రెండు దుకాణాల నిర్వాహకులపైన, కాటాలు సరిగాలేని నాలుగు దుకాణాల నిర్వాహకులపైన కేసులు నమోదు చేసి వారి కాటాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో నెల్లూరు ఇన్‌స్పెక్టర్ లిల్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

## రోజా పువ్వు వాసన ఇంపు.. రోజా నోరు మాత్రం కంపు!

**- ఎమ్మెల్యే రోజాపై ఆనం వివేకా విమర్శనాస్త్రాలు**



రాజకీయాల్లో వెకిలి చేష్టలు, కామెడి పనికి రావని, ఓ మహిళగా హుందాగా వ్యవహరించాలని వైసిపి ఎమ్మెల్యే రోజాపై మాజీఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నాయకుడు ఆనం వివేకానందరెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. ఆదివారం నెల్లూరు ట్రంకురోడ్డులోని తన కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రోజా తన నియోజక వర్గ ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబుపై నోటికొచ్చినట్లు మాట్లాడడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. చంద్రబాబునాయుడు చేసే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి మీ పార్టీ వారే ఆకర్షితులవుతున్నారన్నారు. ఆయన్ను ఎదుర్కొనే ధైర్యం లేక వైకాపా వారు చివరి అస్త్రంగా రోజాను వదులుతున్నారని, ఆమె నోటికి ఏమివస్తే అది మాట్లాడుతూ జోకర్‌లా మిగిలిపోతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగానే కాకుండా దేశ రాజకీయాల్లోనే ప్రత్యేకగుర్తింపు కలిగిన చంద్రబాబుని విమర్శించే ముందు తన స్థాయి ఏమిటో రోజా తెలుసుకోవాలని దుయ్యబట్టారు.

## సుందరయ్య కాలనీకి బస్సులు నడపండి

కోమిట్ల యాజమాన్యం నడుపుతున్న నరుకూరు-ఎన్జీఓ కాలనీ సిటీ బస్సులను సుందరయ్యకాలనీ వరకు పొడిగించాలని సోమవారం 24, 25డివిజన్ల మహిళా నాయకురాళ్ళు కోమిట్ల ట్రావెల్స్ అధినేతకు వినతిపత్రం సమర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు, మాజీకార్పొరేటర్ షేక్ షాహినాబేగం మాట్లాడుతూ సుందరయ్యకాలనీలోని అంబేద్కర్ నగర్, చలపతినగర్, జాషువానగర్, ఆటోవర్కర్స్ కాలనీలలో దాదాపు రెండువేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారని, వీరంతా రోజువారీ పనులకు నెల్లూరు టౌన్‌లోకి ప్రతిరోజూ వస్తుంటారని, ఈ ప్రాంతంలో సిటీ బస్సులు లేని కారణంగా ప్రజలు ఆటో ఛార్జీలను చెల్లించలేకున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా ఉపరవాణా కమిషనర్‌ను కలిశామని, ఆయన కూడా సానుకూలంగా స్పందించి ఈ మార్గంలో పర్మిట్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా వున్నారన్నారు. కోమిట్ల అధినేతను కలిసిన వారిలో పి.శైలజారాణి, పోలమ్మ, సుజాత, అమ్ములు, మురళీ ఉన్నారు.

# ఏపికి వరం... పోలవరం



• ప్రాజెక్ట్ యంత్రాలకు నెల్లూరులో పూజలు

మన రాష్ట్రంలో శ్రీశైలం, నాగార్జునసాగర్, తుంగభద్ర, సోమశిల... ఇలా ఎన్నో భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు కట్టారు. అయితే వాటికి శంకుస్థాపన చేయడం, ప్రారంభోత్సవం చేయడం మాత్రమే జనానికి తెలుసు. మధ్యలో పిల్లర్లు వేసేటప్పుడు, షట్టర్లు బిగించేటప్పుడు, యంత్రాలను అమర్చేటప్పుడు హంగామా చేయడం ఎప్పుడూ లేదు. ఇప్పటి ప్రభుత్వం మాత్రం ప్రతి పనికీ పెద్ద హంగామా చేస్తోంది. ఇలాంటిదే మొన్న నెల్లూరులో చోటు చేసుకుంది. రాష్ట్ర రైతాంగానికి వరం లాంటి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం జర్మనీలో బావర్ కంపెనీ తయారు చేసిన 'డయాఫ్రం వాల్' పరికరాలను చెన్నై పోర్టులో దిగుమతి చేసుకుని భారీ వాహనాలలో పోలవరంకు పంపిస్తూ ఆదివారం ఉదయం 11గంటలకు నెల్లూరు, సింహపురి హాస్పిటల్స్ క్రాస్ వద్దకు వచ్చాయి. వీటితో పాటు సాగునీళ్ల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కూడా వచ్చాడు. తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీమంత్రులు బీద మస్తాన్‌రావు, తాళ్లపాక రమేష్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, బీద మస్తాన్‌రావు, పరసారత్నం, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, గూటూరు కన్నబాబు, టి.అనూరాధ తదితరులు ఈ యంత్రాలకు దిష్టితీసి పూజలు నిర్వహించి ఆర్భాటం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దేవినేని ఉమ మాట్లాడుతూ 2018కల్లా పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని, రాష్ట్ర రైతాంగానికి ఇదొక వరమని పేర్కొన్నారు.

# తీరంకు పర్యాటక సోయగం!



జిల్లాలో పర్యాటక అభివృద్ధి నామమాత్రంగా వుంది. పర్యాటక ప్రగతికి ఎన్నో అవకాశాలున్నా, పర్యాటకులను ఆకర్షించడానికి ఎన్నో ప్రకృతి అందాలున్నా వాటిని మలచుకోలేకపోతుండడం వల్ల పర్యాటక అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని తీరప్రాంతంలో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి 63కోట్ల రూపాయలు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి ప్రకటించారు. గత నెల 28వ తేదీన నెల్లూరులోని హరిత హోటల్‌లో పర్యాటక ప్రగతిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 'స్వదేశీ దర్శన్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 63కోట్లు మంజూరు చేసిందని, ఈ డబ్బులతో బి.వి.పాలెం, ఇరకం, వేనాడు, అటకానితిప్ప, నేలపట్టు, నెల్లూరు చెరువు, మైపాడు, రామతీర్థం, ఇస్కపల్లి బీచ్‌లను అభివృద్ధి చేయనున్నామని చెప్పారు.

ఈ సమావేశంలోనే నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి నెల్లూరు చెరువు, కొత్తూరు వద్ద హరితవనం ప్రాజెక్ట్‌లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కోరారు. జడ్పీ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణంలు పాల్గొని పర్యాటక ప్రగతిపై తమ సూచనలు, సలహాలు ఇచ్చారు.

## బండ్లమాంబ రాజమాతకు

# సింహపురి నీరాజనం

• టౌన్‌హాలులో భవిష్యవాణి జ్యోతిష్య సదస్సు



ఫిబ్రవరి 29వ తేదీ సోమవారం సాయంత్రం నెల్లూరు పురమందిరం జన సంద్రంగా మారింది. అంతర్జాతీయ జ్యోతిష్య శాస్త్రవేత్తగా ప్రసిద్ధిచెందిన జి.వి.యల్.నరశింహాచార్యులు ఆధ్వర్యంలో మయూరి హోటల్స్ అధినేత వీరిశెట్టి సుబ్బారావు సారధ్యంలో నిర్వహించిన భవిష్యవాణి కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా విచ్చేసిన నరసింహాచార్యుల గురువు రాజమాత బండ్లమాంబను తిలకించడానికి ప్రజలు విశేషంగా తరలివచ్చారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులోనే ఆమె వున్నప్పటికీ చాలాయేళ్ళ తరువాత ఆమె ఓ బహిరంగ కార్యక్రమంలో పాల్గొనడానికి నెల్లూరుకు రావడంతో భక్తజనం టౌన్‌హాలుకు పరుగులు తీశారు. ప్రజల ఉపయోగార్థం టౌనుహాల్ వరండాలో డిజిటల్ టీవీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాతాజీ ప్రసంగిస్తూ సత్యం సర్వాంతర్యామి అని, సత్యానికి రూపం లేదని, సత్యం ఉంటేనే నిత్యం బతుకుతామన్నారు. దైవబలంతో ఉత్తమ లక్ష్యాలను సాధించ గలుగుతామన్నారు. ప్రతిఒక్కరు అనుకూలంగా జీవితాలను మలచుకునేందుకు భవిష్యవాణి ఉపయోగపడుతుందన్నారు. తొలుత జ్యోతిప్రకాశం గావించి మాతాజీ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాతాజీని, అంతర్జాతీయ జ్యోతిష్యులు జివిఎల్ నరసింహాచార్యులను గజమాలతో, శాలువాతో, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

అనంతరం ముఖ్యఅతిథులుగా విచ్చేసిన 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ ఎండి వీరిశెట్టి హజరత్‌బాబు, మయూరి సుబ్బారావు, వేనాటి రామచంద్రారెడ్డి, కోట సునీల్‌కుమార్‌లను మాతాజీ బండ్లమాంబ శాలువ, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజమాతా దేవి దుర్ముఖినామ సంవత్సర తెలుగు పంచాంగ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జివిఎల్‌ఎన్ ఆచార్యులు మాట్లాడుతూ సక్రమమైన మార్గంలో ప్రజలను నడి పించేందుకు భవిష్యవాణి జ్యోతిష్య సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సభా కార్యక్రమానికి ముందు శ్రీ గురుకృప సంగీత విద్యాలయం చిన్నారులు ఆలపించిన భక్తి సంగీత గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 'కళాంజలి' అనంత్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి నలుబోలు బలరామయ్యనాయుడు, కె.వి. రమణారెడ్డి, విశ్వం, బెనర్జి తదితరులు సహకరించి విజయవంతం చేశారు.

# శ్రీసిటీలో భద్రతా వారోత్సవాలు



తడ సమీపంలోని శ్రీసిటీ సెజ్‌లో 45వ జాతీయ భద్రతా వారోత్సవాలు ఫిబ్రవరి 27న ప్రారంభమయ్యాయి. శ్రీసిటీ ఇన్‌ఫ్రా విభాగం వైస్‌ప్రెసిడెంట్ ఎన్.శేఖర్ ఈ వారోత్సవాలను ప్రారంభించారు. శ్రీసిటీ యం.డి.రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అధిక శాతం ప్రమాదాలకు మూలం అజాగ్రత్తే నన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది చేత భద్రతా ప్రతిజ్ఞ చేయించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు






## కాలధర్మం

### వేములపాటి అనంతరామయ్య



సీనియర్ న్యాయవాది, అవిశ్రాంత కమ్యూనిష్టు నాయకులు వేములపాటి అనంతరామయ్య మార్చి 1వ తేదీ హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన వయసు 93సంవత్సరాలు. ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలున్నారు. ఉదయగిరి ప్రాంతంలోని ఆదిమూర్తిపాలెం ఆయన స్వగ్రామం. చిన్న తనంలో తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ సంరక్షణలో పెరిగారు. కావలిలో చదివే రోజుల్లోనే జాతీయ కమ్యూనిష్టు నాయకుడు బాకీవాలాతో ఏర్పడిన పరిచయంతో కమ్యూనిజం వైపు ఆకర్షితులయ్యారు. నెల్లూరు విఆర్‌సిలో డిగ్రీని, మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో బిఏను పూర్తి చేశారు. పూణేలో న్యాయవాద పట్టాను స్వీకరించారు. మహాత్మాగాంధీ సతీమణి కస్తూర్బా గాంధీ సంతాపసభలో అనంతరామయ్య చేసిన ప్రసంగం దేశవ్యాప్తంగా అందరినీ అలరించింది. 1947లో ఆయన నెల్లూరులో న్యాయవాద వృత్తిని స్వీకరించి, కొన్ని వేల కేసులను వాదించారు. 63ఏళ్ల పాటు ఆయన న్యాయవాద వృత్తిలో కొనసాగారు. కమ్యూనిజంపై అధ్యయనం కోసం చైనా, రష్యా దేశాలలో పర్యటించారు. ఎందరో కమ్యూనిష్టు యోధులను కలుసుకున్నారు. నెల్లూరు మున్సిపాల్టీలో 3సార్లు కౌన్సిలర్‌గా పనిచేశారు. భోఫోర్స్ కేసు విషయంలో ఆనాటి ప్రధాని పి.వి.నరసింహరావు న్యాయ సలహాదారులలో అనంతరామయ్య ఒకరు. ఎమర్జెన్సీ సమయంలో మహాకవి శ్రీశ్రీకి నెల్లూరులో ఆశ్రయమిచ్చింది కూడా అనంతరామయ్యే. నెల్లూరుజిల్లాలో దాదాపు 40కార్మిక సంఘాలకు ఆయన గౌరవాధ్యక్షులుగా పని చేశారు. ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### వేనాటి వనమ్మ



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి మాతృమూర్తి వేనాటి వనమ్మ(93) ఈ నెల 1వ తేదీ కన్నుమూశారు. ఆమె గత కొంత కాలంగా అస్వస్థతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆమె సూళ్లూరుపేట మండలంలోని నాదెండ్లవారి కండ్రిక గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా వున్నారు. ఆమె భర్త వేనాటి సుబ్బారెడ్డి గతంలో సూళ్లూరుపేట సమితి అధ్యక్షులుగా పని చేశారు. ఇక పెద్దకొడుకు దివంగత వేనాటి మునిరెడ్డి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులుగా వుంటూ సూళ్లూరుపేట మండలాధ్యక్షుడిగాను, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గాను పని చేశారు. రెండో కుమారుడు వేనాటి రామచంద్రారెడ్డి తెలుగుదేశంపార్టీలో పలు పదవులు నిర్వహించడంతో పాటు శ్రీ చెంగాళమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్‌గా గతంలో సమర్ధవంతంగా పని చేశారు. ప్రస్తుతం సూళ్లూరుపేట జడ్పీటీసీగా వుంటూ జడ్పీలో ప్రతిపక్షనేతగా వ్యవహరిస్తున్నారు. 1వ తేదీన స్వగ్రామమైన మావిళ్లపాడులో వనమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### "మైకో" బాలు



ఆయన అసలు పేరు కె.బాలసుబ్రహ్మణ్యం. కానీ ఆయన మైకోబాలుగానే అందరికీ సుపరిచితుడు. బాలసుబ్రహ్మణ్యం తన 79వ యేట ఫిబ్రవరి 27వ తేదీ శనివారం కన్నుమూశాడు. ఆయనను చూస్తే 79సంవత్సరాలు వుంటాయంటే ఎవ్వరూ నమ్మరు. ఎప్పుడూ చలాకీగా వుండేవాడు. ఆర్.ఆర్.స్ట్రీట్‌లో నర్తకి సినిమాహాలు కట్టకముందు నుండీ మైకో బ్యాటరీలు, ప్లగ్గులు నెల్లూరు, ప్రకాశం జిల్లాల డీలర్‌గా ఆ ప్రాంతంలో "బాలు" ప్రసిద్ధి.

వ్యాపారంతో పాటు సామాజిక సేవ పట్ల కూడా బాలు ఎక్కువ సమయాన్ని వెచ్చించేవాడు. రోటరీ క్లబ్బు సభ్యుడిగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అన్న లక్ష్యంతో దాదాపు 70కిపైగా కంటి వైద్య శిబిరాలను నిర్వహించిన ఖ్యాతితోపాటు ఇంకా గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయోజనం చేకూరే అనేక సంక్షేమ కార్యక్రమాలకు కూడా బాలు సారథ్యం వహించాడు. ఆయనకు భార్య లక్ష్మీకుమారి, కుమారుడు రాజేష్ బాలసుబ్రహ్మణ్యం వున్నారు. ఆయన కుమారుడు రాజేష్ ఆస్ట్రేలియాలో ఓ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన బాలసుబ్రహ్మణ్యం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

**సంతాపం:** "మైకోబాలు" మరణం తనకు తీరని లోటని శ్రీ కస్తూరిదేవి విద్యాసంస్థల సెక్రటరి మరియు కరస్పాండెంట్, రోటరీ మాజీగవర్నర్ జె.వి.రెడ్డి ఓ ప్రకటనలో తెలిపాడు. బాలుతో తనకు యాభై సంవత్సరాల సాన్నిహిత్యం వుందని, మంచి మిత్రుడుగానే కాకుండా సేవాస్ఫూర్తి అంకితభావం, చిత్తశుద్ధి కలిగిన రొటేరియన్‌గా ఆయనకు మంచి పేరుందని పేర్కొన్నాడు. రోటరీలో దాదాపు రెండు దశాబ్దాల పాటు అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత శ్రేయస్సుని బాలు ఎప్పుడూ కాంక్షించేవాడని జె.వి.రెడ్డి పేర్కొన్నాడు. బాలు కుటుంబసభ్యులకు ఆయన తన సంతాపాన్ని ప్రకటించాడు.

## కల్యాణమండపం అభివృద్ధికి చర్యలు

**- చదలవాడ కృష్ణమూర్తి**



గూడూరు రెండవ పట్టణంలో వున్న తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం సాయంత్రం ఇక్కడ ఆ మండపాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడ సుమారు 1500 మంది కూర్చుని ఆధ్యాత్మిక కార్యక్రమాలను తిలకించేందుకు అనువుగా మండపాన్ని నిర్మించేందుకు నిధులు కేటాయిస్తామన్నారు. రాజావీధిలో వున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ-దర్శన్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గూడూరు కూడలి ప్రాంతం కావడం వల్ల ఇక్కడ నుంచి భక్తులు అధికసంఖ్యలో శ్రీవారి దర్శనం కోసం వస్తుంటారని, భక్తుల సౌకర్యార్ధం కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట టిటిడి అధికారులు సిఇ చంద్రశేఖర రెడ్డి, ఇ.ఇ కృష్ణారెడ్డిలతో పాటు స్థానిక ప్రముఖులు కె.మునిగిరీష్, వల్లంకొండ వెంకటసుబ్బయ్య తదితరులు వున్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

## తిప్పవరప్పాడులో కైలాసనాధేశ్వర విగ్రహ ప్రతిష్ఠ



మహాకుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, డిఎస్పీ బి.శ్రీనివాస్ తదితరులు

గూడూరు మండల పరిధిలోని తిప్ప వరప్పాడు గ్రామంలో ఆదివారం కామాక్షి సమేత శ్రీ కైలాసనాధేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా ఎంతో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మశ్రీ మాచవోలు రాజశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు వేదమంత్రోచ్ఛటనలతో, మంగళవాయిద్యాల మధ్య ఎంతో భక్తిశ్రద్ధలతో వాస్తుహోమం, విగ్రహ గ్రామోత్సవం, సామూహిక లలితా సహస్రనామ హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ, శిఖరాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో ఆలయాన్ని దాతల సహకారంతో సుమారు రెండు కోట్ల రూపాయలతో పునర్నిర్మాణ పనులు జరిగాయి. మూడురోజుల పాటు పూజలు నిర్వహించి విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. స్థానిక ప్రముఖులు మల్లు విజయకుమార్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో పాటు, డిఎస్పీ బి.శ్రీనివాస్, సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి, పలువురు ప్రముఖులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## కష్టపడి చదువుకుంటేనే ఉన్నతస్థాయి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చిన్నతనం నుంచి కష్టపడి చదువుకుంటేనే ఉన్నత స్థాయి లభిస్తుందని, పేదరికాన్ని జయించి సమాజంలో మంచి స్థాయి సాధించి గుర్తింపు పొందవచ్చని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు మండలంలోని దివిపాళెం పంచాయతీలోని చవటపాళెంలో వున్న జడ్పీ ఉన్నత పాఠశాల నాల్గవ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుకున్న వ్యక్తికి సమాజంలో మంచి గౌరవం వుంటుందని, అదేస్థాయిలో ఉన్నతస్థాయికి చేరితే ఆ గొప్పదనమంతా వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈటీవీ, జబర్దస్ట్ ప్రోగ్రాం నటుడు రాంప్రసాద్, జడ్పీటిసి సభ్యురాలు పద్మ తదితరులు పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురందర్‌రాజు ఆధ్వర్యంలో ఈ వార్షికోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఓజిలి ప్రాంతానికి చెందిన రాంప్రసాద్ వేదికపై ఆటపాటలతో నిర్వహించిన కార్యక్రమం చిన్నారులందరినీ బాగా ఆకట్టుకుంది. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆ తర్వాత రాంప్రసాద్‌ను, పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వైజేపి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి, ట్రాన్స్‌కో ఏఇ గురవయ్య, వేణుగోపాల్, బాబు, బలరామయ్య, మంగారావు, ప్రసన్న, కవిత తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద హైస్కూల్‌లో వెజిటబుల్ ఫేర్



విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవసేన

నిత్యం ఆహారంలో కూరగాయలను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని గూడూరు మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన అన్నారు. గూడూరు రెండో పట్టణంలో వున్న వివేకానంద హైస్కూల్‌లో ఇటీవల జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రకాల కూరగాయల ప్రదర్శనలను విద్యార్థులచే నిర్వహించారు. కూరగాయల వల్ల కలిగే లాభాలను విద్యార్థులు ఈ సందర్భంగా వివరించారు. ఈ ప్రదర్శనల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ కరెస్పాండెంట్ చంద్రమోహన్, సంచాలకులు వంశీకృష్ణతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దేశభక్తికి కొత్త అర్థం చెప్పిన రాహుల్

శ్రీను గల్పిక

ఢిల్లీలోని టెన్ జనపథ్. ఉదయాన్నే సైక్లింగ్ ముగించుకుని కాంగ్రెస్ ప్రిన్స్ రాహుల్‌గాంధీ అప్పుడేవచ్చాడు. ఆరోజుటి పేపర్లు తిరగేశాడు. ఒక్క పేపర్‌లోనూ విద్యార్థుల ఆత్మహత్యలు కనిపించలేదు. టివి ఆన్ చేసి వివిధ వార్తాఛానళ్లు మార్చుకుంటూ పోతున్నాడు. ఏ ఛానెల్‌లోనూ విద్యార్థుల సూసైడ్‌కు సంబంధించిన వార్తలు లేవు. రాహుల్‌గాంధీ బాగా అప్సెట్ అయ్యాడు. అంతలో అక్కడకు సోనియాగాంధీ వచ్చింది. మూడీగా వున్న రాహుల్‌ను చూసి... ఏం నాయనా, అలా వున్నావు, పెళ్లిగాని కావాలా అని అడిగింది. అదేం లేదు మమ్మీ... దేశంలోని ఏ యూనివర్సిటీలో కూడా కొత్తగా సూసైడ్‌లు లేవు. మొన్న హైదరాబాద్‌లో, నిన్న జెఎన్‌యూలో జరిగిన సంఘటనలు నెలకొక్కటన్నా జరుగుతుంటే నాకు చేతినిండా పనివుంటుంది. ఒకటికి నాలుగుసార్లు పోయి పరామర్శించి వస్తుండొచ్చు. ఇప్పటికే హైదరాబాద్, జెఎన్‌యూ ఇష్యూలను జనం మర్చిపోయారు. బీజేపీని అన్‌పాపులర్ చేయాలంటే ఇలాంటివి అప్పుడప్పుడన్నా జరుగుతుండాలి కదమ్మా... అని రాహుల్ అన్నాడు. ఓరిపిచ్చి నాయనా!... నువ్వు మనిషివైతే రాష్ట్రపతి భవన్‌లో అశోక చెట్టులా పెరిగావుగాని బుర్ర పెరగలేదు. అందుకే మనం ఈరోజు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ఉన్నాం. సంఘటనలనేవి వాటిపాటికవి జరగవు. మనం క్రియేట్ చేస్తుండాలి. అలా చేస్తేనే అధికారపార్టీని ఎప్పుడూ ఇబ్బంది పెడుతుండగలం అని చెప్పింది. అంతలో అక్కడకు దిగ్విజయ్‌సింగ్ తన భార్య అమృతారాయ్‌తో కలిసి వచ్చాడు. ఈ ఆంటీ ఎవరు అంకుల్ అని రాహుల్ ప్రశ్నించాడు. నా రెండో సతీమణి అని దిగ్విజయ్ చెప్పాడు. మమ్మీ... నాకు ఇంతవరకు ఒక్క పెళ్లి కూడా చేయలేదు, ఆ అంకుల్ మాత్రం చూడు అప్పుడే రెండు పెళ్ళిళ్లు చేసుకున్నాడు. నాకు పెళ్లెప్పుడు చేస్తావు... అని అడుగుతుండగా అప్పుడే వెనుకవున్న టీవీలోని 'జెమిని' ఛానెల్‌లో "పెళ్లెప్పుడవుతుంది బాబు నాకు పిల్ల యాడ దొరుకుతుంది బాబు" అనే ఆలీ పాట కోఇన్సిడెంట్‌గా రాసాగింది. సోనియాకు అరికాల్లో మండి... దిగ్విజయ్‌జీ, రాహుల్ ఇంట్లో వున్నప్పుడు మీరు జంటగా రావద్దని వార్నింగ్ ఇచ్చింది. దాంతో దిగ్విజయ్‌సింగ్ వెంటనే వెనక్కుమళ్లాడు. తర్వాత రాహుల్ వుండి... మమ్మీ, ఈమధ్య దేశంలో ఎక్కడచూసినా 'దేశభక్తి' అనే పదం ఎక్కువగా కనిపిస్తోంది. టీవీలలో చూసినా, పత్రికలలో చూసినా అదే చర్చ. లోక్‌సభలో కూర్చుంటే... మీకు దేశభక్తి లేదంటూ ఆ బీజేపీ వాళ్లు పదేపదే ఎత్తి పొడుస్తున్నారు. అసలు దేశభక్తి అంటే ఏంటి మమ్మీ అని అడిగాడు. అప్పుడే విహెచ్ హనుమంతరావు ట్రేలో కాఫీ పట్టుకుని అక్కడకు వచ్చాడు. రాహుల్ సంధించిన ప్రశ్న విని... ఆయన కరెక్ట్ టైంకు కరెక్ట్ ప్రశ్న అడిగారు బాబు... దేశ భక్తి అంటే మీ కుటుంబం పట్ల ఈ దేశ ప్రజలకు ఉన్న భక్తి అని అర్థం. ఈ ప్రజలంతా మీ కుటుంబ భక్తులు. కాబట్టే తరతరాలుగా మీ కుటుంబానికే ఓట్లేస్తూ, మీ కుటుంబంలోని వారినే ప్రధానులుగా చూసుకుంటున్నారు. "ఇందిరనే ఇండియా, ఇండియానే ఇందిర" అన్న మాట మీరు వినే వుంటారు. అంటే దానర్థం ఈ దేశమంటే మీరేనని. అలాంటిది ఈమధ్య ప్రజల్లో మీ పట్ల భక్తి తగ్గిపోయింది. అంటే దేశభక్తి తగ్గిపోయిందని అర్థం. ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలలో ఆ దేశభక్తిని పెంపొందింపజేయాలన్నాడు. దానికి రాహుల్... దేశభక్తిని పెంపొందించాలంటే దేశంలోని అన్ని యూనివర్సిటీలలో జాతీయ జెండాలను ఎగురవేయాలిగాని కాంగ్రెస్‌పార్టీ జెండాలను కాదని చెబుతుందేంటి ఆ స్మృతి ఇరాని అని రాహుల్ అడిగాడు. అసలైన దేశభక్తి గురించి తెలియని వాళ్లంతా మంత్రులయ్యారు, దేశభక్తికి వాళ్లు కొత్త నిర్వచనాలు చెబుతున్నారు. మీరన్నా... ఈ పద్ధతిని మార్చాలి బాబు అని విహెచ్ చెప్పి లోపలకు వెళ్లిపోయాడు.

★★★★★

అది పార్లమెంటు భవనం... సభలో జెఎన్‌యు ఘటనపై చర్చ జరుగుతోంది. స్మృతి ఇరాని జెఎన్‌యు ఘటనపై ఆవేశంగా మాట్లాడారు. జెఎన్‌యు విద్యార్థులు పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసారని, భారత్‌ను ముక్కలు చేస్తామన్నారని, దుర్గాదేవి పై అభ్యంతరకర వ్యాఖ్యలతో కరపత్రాలు పంపిణీ చేశారని ఆమె ఆరోపించారు. వెంటనే సిపిఎం సభ్యుడు సీతారాం ఏచూరి లేచి... ఇందులో తప్పులేమున్నాయమ్మా... పాకిస్థాన్ మన దాయాది దేశమే కదా, వాళ్లకు జిందాబాద్ కొడితే ఒకటి, మనకు జిందాబాద్ కొడితే ఒకటా. వీళ్ల మొహాలు... వీళ్లకు భారత్‌ను ముక్కలు ముక్కలు చేసేంత తెలివితేటలున్నాయా... ఆ పనేదో చేయడానికి మేము, కాంగ్రెస్ వున్నాం కదా, దుర్గాదేవిపై పాంప్లెట్ చాలాచిన్న విషయం. ఒకవేళ తప్పు చేసివుంటే అంతపెద్ద రాక్షసుడు మహిషాసురుడినే చంపిన ఆమెకు ఇలాంటి పిల్లకాయలు ఓ లెక్కా? ఇవన్నీ చిన్నచిన్న తప్పులే... కాని దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేసినవారిని అరెస్ట్ చేసి మీరు దేశద్రోహానికంటే ఎక్కువ నేరానికి పాల్పడుతున్నారు. అసలు మీలోనే దేశభక్తి తగ్గిపోతుందని సీతారాం ఏచూరి అన్నాడు. మాయావతి లేచి... ఉగ్రవాదులకు మద్దతు తెలిపిన వారినల్లా మీరు అరెస్ట్ చేస్తుంటే ఈ దేశంలో జైళ్లు చాలవు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ జైళ్లను కూడా వాడు కోవాల్సి వుంటుంది. అయినా ఎంత దుర్మార్గులైనప్పటికి చనిపోయిన వాళ్లను మనం దేవుళ్లతో సమానంగా చూస్తాం. హెచ్‌సియులో వేముల రోహిత్, జెఎన్‌యులో కుమార్‌లు యాకూబ్, అఫ్జల్‌గురులను దేవుళ్లుగానే చూశారు. అందులో తప్పేముంది... అసలు తప్పంతా బీజేపీలోనే వుంది. దేశభక్తి మీకే లేకుండాపోతోంది అని మండిపడింది. అప్పుడు రాహుల్ గాంధీ ఆవేశంగా లేచి... మీ అందరిలోనూ దేశభక్తి తగ్గిపోతుంది... అని అన్నాడు. ఆ మాటకు సభలోని సభ్యులంతా నిశ్చేష్టులయ్యారు. బీజేపీ వాళ్లయితే రాహుల్‌లో ఇంత మార్పు వచ్చిందా... అని లోలోపల సంబరపడసాగారు. రాహుల్ తన ప్రసంగాన్ని కంటిన్యూ చేస్తూ... అవును, మీలో, ఈ ప్రజల్లో దేశం పట్ల భక్తి తగ్గింది. దేశమంటే మా గాంధీ కుటుంబం. మా కుటుంబం అధికారంలో వుంటే ఇన్ని గొడవలు, ఇంత హింస వుండేది కాదు. మీలో దేశభక్తి తగ్గబట్టే మేం అధికారంలో లేకుండాపోయాం. కాబట్టే దేశంలో ఈ అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొంటున్నాయి. మీరు నిజమైన దేశభక్తులైతే ఈ సారన్నా మాకు అధికారం కట్టబెట్టాలి. దేశం పట్ల మీ భక్తిని నిరూపించుకోవాలి. మాకు వ్యతిరేకంగా ఓటేసే వాళ్లంతా దేశద్రోహులే... కాబట్టి వచ్చే ఎన్నికలలోనన్నా మీ దేశభక్తిని నిరూపించుకోండని చెప్పి కూర్చున్నాడు. దేశభక్తికి కొత్త అర్థం చెప్పిన రాహుల్ స్పీచ్‌కు సభ్యులంతా నోర్లు తెరిచారు.

## మేషం


అశ్విని, భరణి, కృతిక 1 పాదము

చేపట్టిన పనులకు ఆటంకాలుండినా అధిగమించి పనులు జరుపుకొంటారు. ఆరోగ్య లోపం ఉండే అవకాశ మున్నది. గాయాలు తగలవచ్చును. పదవులు బాధ్య తలు సభ్యత్వాలు స్వీకరిస్తారు. ఉపాధి పథకాలలో స్థిరపడతారు. వృత్తి వ్యాపార జీవనం కలవారికి మంచి అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. కొన్ని అదనపు ఖర్చులు కూడా తప్పవు.

## వృషభం


కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, అధికారులకు స్థానమార్పులుండవచ్చును. ఖర్చులు పెరిగినా ఇబ్బంది కలుగదు. ఉద్యోగావకాశాలు ఫలించే సమయం. ఆర్థిక పటిష్టత ఉండి, వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం పెరుగుతుంది. కొత్త వ్యాపారాలు, నవ నిర్మాణాల వంటివి చేపట్టుతారు. పెద్దలు ప్రముఖులతో ఆత్మీయత బాగుం టుంది. కొత్త వస్తువులను సమకూర్చుకొంటారు.

## మిథునం


మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులు అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. పనులు సగగా జరగక టెన్షన్ పడుతుం టారు. ఈ వారం ఖర్చులు బాగా పెరుగుతాయి. అప్ప రాలకు అప్పు చేయవలసి వస్తుంది. పెద్దమొత్తాలలో ఆర్థిక లావాదేవీలను వాయిదా వేసికొనండి. వ్యాపారాభి వృద్ధి అవకాశాలు, పెట్టుబడులకు అవకాశాలు చేజారి పోవచ్చును. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి.

## కర్కాటకం


పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

మీ ప్రయత్నాలకు పనులు అనుకూలించగలవు. ఉద్యోగులు తమ పైఅధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. వృత్తి ఉపాధి రంగాల వారికి ఆర్థిక స్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. కొత్త ఉద్యోగావ కాశాలకు అనుకూల సమయం.

## సింహం


మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

బిడ్డల విద్యా వివాహ ఉద్యోగ విషయాలలో శుభ పరిణామాలు చోటు చేసుకొంటాయి. కొత్త పెట్టుబడు లకు అనుకూల సమయం. బంధువులతో మాట పట్టింపులు సమస్యలు రావచ్చును. అనుకున్న పనులు ఎంత సమర్థవంతంగా నిర్వహించినా ఆటంకాలుం టాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. కళా క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాలలో ఉద్యోగ అవకాశాలుంటాయి.

## కన్య


ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అధికారులకు స్థానమార్పులు, ఉద్యోగులకు పని భారం వత్తిడి పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడవచ్చును. ప్రభుత్వ సంబంధమైన పనులందు అదనపు ఖర్చులు పైనబడగలవు. అనుకున్న పనులు కూడా నిదానంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. కాంట్రాక్టర్లకు ప్రభుత్వ వత్తిడి పెరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 4.03.2016 నుండి
తేది. 10.03.2016 వరకు

ఈ వారము ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు, సింహంలో గురురాహువులు, వృశ్చికంలో శని కుజులు, మకరంలో శుక్రుడు, 7వతేది నుండి కుంభంలో శుక్రుడు, కుంభంలో రవిబుధ కేతువులు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 7 సోమవారము మహాశివరాత్రి
తేది 9 బుధవారము సూర్యగ్రహణము

**ముహూర్తములు**

తేది 5 శనివారము ఉదయం 6.48 నుండి 8.24లోగా మీన లగ్నమున శంకుస్థాపన.
తేది 10 గురువారం రాత్రి 12.20 నుండి 2.20లోగా ధనుర్లగ్నమున గృహ ప్రవేశము.

**మాఘ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 4 | శుక్ర | దశమి | ప॥ గం.2.0వ॥ |
| తేది. 5 | శని | ఏకాదశి | ప॥ గం.1.40వ॥ |
| తేది. 6 | ఆది | ద్వాదశి | ప॥ గం.12.52వ॥ |
| తేది. 7 | సోమ | త్రయోదశి | ప॥ గం.11.42వ॥ |
| తేది. 8 | మంగళ | చతుర్దశి | ఉ॥ గం.10.0వ॥ |
| తేది. 9 | బుధ | అమావాస్య | ఉ॥ గం.8.13వ॥ |
| | పిదప | పాడ్యమి | పూర్తిగ |
| తేది. 10 | గురు | విదియ | రా॥ గం.3.47వ॥ |

## తుల


చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బంధుత్వాలు బలపడి పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. షేర్లు పెట్టు బడులకు అవకాశాలు దొరుకుతాయి. బిడ్డల విద్యా, వివాహ, ఉద్యోగ విషయాలలో అనుకూల పరిణామా లుంటాయి. కోర్టు కేసులందు అనుకూలత కలదు.

## వృశ్చికం


విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. స్థిరాస్తుల క్రయ విక్రయాలు జరుగగలవు. డబ్బు, వస్తువులు జాగ్రత్తగా కాపాడుకొనండి. పట్టుదలకు పోయి వివాదాలు తెచ్చు కొనకుండా సర్దుబాటు చేసికొంటూ పనులు జరుపు కోండి. వృత్తి వ్యాపార వర్గాలకు అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం సంతృప్తికరం. మీపై నిందలు, విమర్శలుం టాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

యాజమాన్యాలు వర్గాలతో జాగ్రత్తగా ఉండాలి. బంధువర్గంలో అనారోగ్య వార్తలు వింటారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థికాభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగు తుంది. అయినా ఖర్చులు కూడా ఏదో ఒక రూపంలో పైనబడగలవు. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. అనుకున్న పనులు టెన్షన్ పెట్టి, సక్రమంగా జరుగు తాయి. విద్యాప్రగతి బాగుంటుంది.

## మకరం


ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు అధికారుల సహకారం ఆదరణ బాగుం టుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. కొత్త పరిచయాలు కలిగి వాటి వల్ల మేలు జరుగుతుంది. ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు ఫలించగలవు. అయితే ఖర్చులు పెరిగినా భారమనిపించవు. అనుకున్న పనులు నెరవేరగలవు. కొత్త వస్తువులు, విలువైన వస్తువులు సమకూర్చుకొం టారు. కోర్టు కేసులందు అనుకూలత బాగుంటుంది.

## కుంభం


ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు

ఖర్చులు పెరిగి ఆదాయం సరిపోతుంటుంది. గృహ వస్తు వాహన రిపేర్లు ఖర్చులు, బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. అనుకున్న పనులకు ఆటంకాలు కలగడం, టెన్షన్, కోపం ఎక్కువగా ఉం టుంది. సమస్యలను ప్రశాంతంగా పరిష్కరించుకొన వలెను. వృత్తి వ్యాపార రంగాలలో మంచి అవకాశాలు చేజారి ఆశించిన స్థితి ఉండదు.

## మీనం


పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

రావలసిన బాకీలు కొంత లభిస్తాయి. కోర్టు కేసు లందు అనుకూలత కలదు. శుభకార్యాలందు, సభలు సమావేశాలందు పాల్గొంటారు. ఆర్థిక వ్యవహారిక ఒప్పందాలకు అనుకూల సమయం. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, రాబడి పెరగడం జరుగుతుంది. ఉద్యోగులకు వ్యాపార రంగాల వారికి ప్రభుత్వం నుండి వత్తిడి ఇబ్బంది లుండవచ్చును. విద్యాప్రగతి బాగుంటుంది.

# కల్యాణ వైభవం...!



పరమేశ్వరి మహేశ్వరి కల్యాణ మండపాల అధినేత చాకిరాల శేషయ్య - నాగభూషణమ్మల కుమారుడు **సాయి చైతన్య - అనూష** (నెల్లూరు వాస్తవ్యులు బద్రి చంద్రశేఖర్ - నాగలక్ష్మిల కుమార్తె)ల కల్యాణం ఫిబ్రవరి 17వ తేదీ నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



విద్యుత్‌శాఖ రిటైర్డ్ జెఏఓ యజ్ఞావర్ఘుల విశ్వనాధం - చాయాదేవిల కుమార్తె **భానులత - దిలీప్ బాబా** (హైదరాబాద్ వాస్తవ్యులు పణతుల సాయికుమార్ - వేదవతిల కుమారుడు)ల పెళ్ళి ఫిబ్రవరి 19వ తేదీ నెల్లూరులోని సోమిశెట్టి వారి కల్యాణ మండపంలో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనెలు.



గూడూరు వాస్తవ్యులు జి.కె.గురుగుహ - సుకుందల కుమార్తె **సాయి రమ్య - వెంకటపవన్‌కుమార్** (ప్రకాశం జిల్లా, పొదిలి గ్రామ వాస్తవ్యులు మన్నేపల్లి వెంకటసుబ్బారావు - నాగశ్రీదేవిల కుమారుడు)ల పరిణయం ఫిబ్రవరి 27వ తేదీ గూడూరు పివిఆర్ కల్యాణ మండపంలో అత్యంత వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' అభినందనలు.

# నిబంధనల మేరకే కేంద్రం నుంచి నిధులు

## - బిజెపి నేత కందుకూరి






నిబంధనల మేరకే కేంద్రప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందే తప్ప, గత ప్రభుత్వాల మాదిరిగా ప్రజలను లేని పోని మాటలతో మభ్యపెట్టి మోసం చేసే సంస్కృతి బిజెపికి లేదని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కందుకూరి సత్యనా రాయణ అన్నారు. బుధవారం కావలిలోని నమస్కార్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్ట్‌కు కేవలం నూరు కోట్లు మాత్రమే కేటాయించారంటూ మిత్రపక్షమైన టిడిపి విమర్శించడం సరైనది కాదన్నారు. గతంలో కేంద్రం విడుదల చేసిన నిధులకు ఎంతవరకు పనులు చేశారో లెక్కలు చూపి, ఆ తర్వాత నిధులు కావాలంటే సబబే కానీ, చిత్తం వచ్చిన రీతిగా మాట్లాడుతూ నిధులు కావాలంటే ఇచ్చే పద్ధతి బిజెపికి లేదన్నారు. విభజనలో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని, ఆ లోటును పూడ్చేందుకే 'ఏపి అభివృద్ధే బిజెపి సంకల్పం' అనే నినాదంతో బిజెపి ముందుకు సాగుతోందన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో తోడ్పాటునిస్తుందని ఆయన అన్నారు. కావలిలో శేషాద్రి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ ఏర్పాటుచేయడంలో అందరి కృషీ వుందన్నారు. గతంలో ఎన్‌డిఏ ప్రభుత్వంలోనే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ ఏర్పాటుచేశారని, మరలా బిజెపి అధికారంలోనే కేంద్ర రైల్వేమంత్రి శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ ఏర్పాటు చేశారని, ఇదెంతో హర్షదాయకమని అన్నారు. బిజెపి ఎదుగుదలను చూసి ఓర్వలేకనే బిజెపిపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. గత పదేళ్ళ కాలంలో కాంగ్రెస్ రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీ లేదని ఆయన అంటూ, గతంలో రాష్ట్రం విద్యుత్ కొరతతో తీవ్రంగా సమస్యలు ఎదుర్కొంటూ వుండేదని, ఇప్పుడు ఆ సమస్యలు లేవని గుర్తుచేశారు. బిజెపి చొరవతో నిరంతర విద్యుత్ ఏర్పాటు చేయడంవల్ల రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ముమ్మరంగా జరుగుతున్నదన్నారు. బిజెపి పట్టణ అధ్యక్షులు వివి రంగారెడ్డి మాట్లాడుతూ, అక్రమంగా ఎలాంటి బిల్లులు లేకుండా బియ్యం లారీలు తిరుగుతుంటే పట్టించుకోని అధికారులు, రైతులు పండించిన ధాన్యాన్నే లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని విమర్శించారు. అధికారులు ఇకనైనా ఆ తీరు మార్చుకోవాలన్నారు. రైతులు ఓచర్‌పై తమ ధాన్యాన్ని ఎక్కడైనా విక్రయించుకునేందుకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు చలువాది సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమణయ్య, మహిళానాయకులు మాధవి, వరలక్ష్మి, పరుసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# టైలర్లు ఆర్థికంగా ఎదగాలి

## - బీదా మస్తాన్‌రావు ఆకాంక్ష




టైలర్లు ఆర్థికంగా ఇంకా బాగా ఎదగాలని, టైలర్లందరూ సంఘాలుగా ఏర్పడి కుట్టు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే పారిశ్రామిక విధానం వైపు పయనించాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర రాజధాని కమిటీ సభ్యుడు బీదా మస్తాన్ రావు ఆకాంక్షించారు. కావలి పట్టణంలో ఆదివారం దర్జీలు (టైలర్ల) దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కావలి డివిజన్ టైలర్ల సంఘం ఆధ్వర్యంలో టైలర్లందరూ స్థానిక జెండాచెట్టు కూడలి వద్ద నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితర స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ, టైలర్లు కుట్టు పరిశ్రమలు పెట్టుకుంటే తనవంతు సాయం అందిస్తానన్నారు. బిఎంఆర్ ట్రస్ట్ ద్వారా అత్యాధునిక కుట్టు యంత్రాలను 10 మంది పేద మహిళలకు అందజేస్తామన్నారు. దర్జీలుగా పనిచేస్తూ మృతిచెందిన వారి కుటుంబాలకు ఈ సందర్భంగా నగదు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టైలర్ల సంఘం అధ్యక్షులు బి. బుజ్జయ్య, గౌరవ అధ్యక్షులు ఏ. నారాయణ, మాలకొండారెడ్డి, జగదీష్ తదితరులతో పాటు స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# దక్షిణ కాశి..శ్రీకాళహస్తి క్షేత్రం







శ్రీకాళహస్తి క్షేత్రం దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన ఆలయం. ఈ కోవలలో కొలువై వున్న పరమశివుడు వాయురూప ధారిగా ప్రతీతి. అందుకే స్వామివారి గర్భాలయంలో ఎడమవైపు వున్న రెండు దీపాలు కదులుతూ స్వామి ఉచ్ఛ్వాస నిశ్వాసలకు నిదర్శనంగా వుంటాయని పురాణాలు పేర్కొంటున్నాయి. నవగ్రహాలు, నక్షత్రాలు, సౌరమండలం అన్నీ శివుని ఆజ్ఞతోనే నడుస్తుంటాయని, రాహుకేతువులు కూడా ఆ శివుని కనుసన్నల్లోనే వుంటాయి కనుక, ఆ దోషాలున్నవారు ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటే గ్రహదోష పరిహారం అవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రీకాళహస్తిలోని పరమేశ్వరుని దర్శించుకుంటే సకల పాపాల పరిహారమై పోయి, శుభాలు కలుగుతాయి కనుక, ఈ క్షేత్రం ఎంతో కాలంగా భక్తులకు పెన్నిధిగా వెలుగొందుతోంది. అందులోనూ మహాశివరాత్రి పర్వదినం రోజుల్లో ఈ ఆలయానికి లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని దర్శించుకుని తరిస్తుంటారు. స్వామికి అలంకరించే నవగ్రహ కవచానికి ప్రత్యేక ప్రాధాన్యత వుంది. ఇది స్వర్ణ కవచం. ఇలా బంగారు కవచం వుండడం ఈ క్షేత్రంలో తప్ప మరే శివాలయంలోనూ కనిపించదు. ఈ కాలంలోనే కాక, పూర్వపు రాజులైన పల్లవ, చోళ, విజయనగర రాజుల కాలంలోనూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం ఒక దివ్యాలయంగా, దక్షిణ కైలాసంగా వుండా భక్తులకు కొంగుబంగారంగా వుండేదని చరిత్ర పేర్కొంటోంది. ఈ ఆలయానికి 1516వ సంవత్సరంలో శ్రీకృష్ణదేవరాయలు తన దక్షిణ భారతదేశ విజయయాత్రకు చిహ్నంగా పెద్ద గాలి గోపురంతో పాటు, నూరుకాళ్ల మండపాన్ని కూడా నిర్మించారు. శ్రీకాళహస్తి క్షేత్రానికి నాలుగు దిక్కుల్లోనూ గోపురాలున్నాయి. ఇవికాక 120 అడుగుల ఎత్తు వున్న రాజగోపురం శిథిలమై కూలిపోవడంతో ఇప్పుడు ఆ గోపుర నిర్మాణం కూడా జరుగుతోంది. ఆలయానికి సూర్య-చంద్ర పుష్కరిణిలు వున్నాయి. దక్షిణం వైపు వున్న గోపురం ద్వారా భక్త కన్నప్ప కొండకు వెళ్ళవచ్చు. అంతేకాదు, శిల్పకళకు పుట్టినిల్లయిన బ్రహ్మగుడికి కూడా వెళ్ళవచ్చు. ఈ ఆలయంలో వైదిక ఆగమ విధానంలో విశిష్టమైన రీతిలో పూజలు జరుగుతుంటాయి. ఎంతో మహిమాన్వితమైన ఈ ఆలయానికి నిత్యం వేలాదిమంది భక్తులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకుంటూ వుంటారు. అందులోనూ ఈనెల 7వ తేది మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విద్యుత్‌దీప కాంతులతో శోభాయమానంగా ఆలయాన్ని అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. దక్షిణ కైలాసంగా భాసిల్లుతోన్న శ్రీకాళహస్తికి ఈ ఉత్సవాలకు లక్షలాది సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు.





కోవూరు శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి - అరుణల కుమార్తె **దివ్య - వరుణ్** (హైదరాబాద్ వాస్తవ్యులు బల్లవరం వెంకటప్రతాప్‌రెడ్డి - విద్యల కుమారుడు)ల కల్యాణం ఫిబ్రవరి 19వ తేదీ నెల్లూరులోని కెజికె కల్యాణ మండపంలో జరుగగా, రిసెప్షన్ వేడుకలు 21తేదీ రాత్రి హైదరాబాద్‌లోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో జరగడం తెలిసిందే! కాగా, ఫిబ్రవరి 27వ తేదీన నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రులు యం.వెంకయ్యనాయుడు, ప్రకాష్ జవదేకర్, సుజనా చౌదరిలు నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని పోలంరెడ్డి నివాస గృహానికి వెళ్లి నూతన దంపతులు దివ్య-వరుణ్‌లను ఆశీర్వదించారు.



## నెల్లూరు ఇంద్రజాలికుడిని సన్మానించిన

# బెంగుళూరు ఇంద్రజాల సంఘం

నెల్లూరులో ఒకప్పుడు ట్రంకురోడ్డులోని ఉషా స్టూడియో అంటే తెలియని వారుండరు. ఉషా కృష్ణమూర్తిగా దాని యజమాని ప్రసిద్ధి. కృష్ణమూర్తి ఫోటోగ్రాఫర్‌గానే కాకుండా ఇంద్రజాలికుడిగా కూడా నెల్లూరీయులకు సుపరిచితుడే. ఇప్పుడు కృష్ణమూర్తి సోదరుడు కూరపాటి మనోహర్ కూడా కనికట్టు నేర్చుకుని ఇంద్రజాల ప్రదర్శకుడిగా పేరు పొందాడు. ఫిబ్రవరి 23వ తేదీ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పి.సి.సర్కార్ 103వ జయంతి సందర్భంగా బెంగుళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో "మ్యాజిక్ సర్కిల్ ఆఫ్ బెంగుళూరు" మనోహర్‌ను సత్కరించారు. ఇంద్రజాలికుడిగా మనోహర్ అందిస్తున్న సేవలకుగాను వారు ఈ సత్కారాన్ని అందించారు.

# సింహపురిలో విజయవంతంగా వెన్నుపూస శస్త్రచికిత్స

నెల్లూరులోని సింహపురి ఆసుపత్రి వైద్యులు ఓ బాలికకు వెన్నుపూస పై భాగంలో అదనపు ఎముక ఏర్పడి కాళ్ళు చచ్చుపడుతున్న దశలో, విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ఆ బాలికకు మంచి జీవితాన్ని ప్రసాదించారు. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యనిపుణులు డాక్టర్ వెంకటేశ్వర ప్రసన్న మాట్లాడుతూ, ఒంగోలుకు చెందిన ఆ బాలికకు పుట్టుకతోనే ఆ సమస్య ఏర్పడిందని, దీంతో రెండు కాళ్ళు చచ్చుబడిపోతున్న విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. అల్ట్రాసోనిక్ ఆస్పిరేటర్ అనే అత్యంత ఆధునిక వైద్యపరికరంతో ఈ శస్త్రచికిత్సను నిర్వహించి, వెన్నుపూస పైభాగంలో వున్న అదనపు ఎముకను తొలగించామన్నారు. శస్త్రచికిత్స అనంతరం బాలిక ఆరోగ్యంగా వుందన్నారు.



ఈ ఆపరేషన్‌లో డాక్టర్లు దీక్షాంతి నారాయణ్, సుజయ్‌సదా, సతీష్, హర్షిత్, రాజమోహనరెడ్డి పాల్గొన్నారని ఆయన తెలిపారు.

# ఎడ్యుకేషన్ వర్క్‌షాప్‌లో మనోహర్‌రెడ్డి

ఇటీవల హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు మలేషియా ప్రభుత్వం సంయుక్తంగా విద్యా రంగంపై సెమినార్‌ను నిర్వహించాయి. ప్రైవేట్ విద్యాసంస్థల తరపున నిర్వహించిన ఈ వర్క్‌షాపులో నెల్లూరు జిల్లా ప్రైవేట్ స్కూల్స్ ప్రతినిధిగా అపస్మా అధ్యక్షులు, మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బి.మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రస్తుతం విద్యారంగంలో చేపట్టాల్సిన మార్పులపై వివరించారు.



మలేషియా రిసోర్స్‌పర్సన్స్‌తో బి.మనోహర్‌రెడ్డి

# నిలబడితేనే తలపడగలడు

(మొదటి పేజీ తరువాయి)

పక్కనపెట్టి 65మంది తెలుగుదేశంలో చేరినా ఎన్నికలు ఎప్పుడూ ఏకపక్షంగా జరగవు. చంద్రబాబు పాలన అద్భుతంగా వుంది, ఇంతకంటే మొనగాడైన పరిపాలకుడు ఇక రాడని జనం అనుకుంటే ప్రతిపక్షం వున్నా కూడా ఎన్నికలు ఏకపక్షంగా, చంద్రబాబు పక్షంగానే జరిగిపోతాయి. వైకాపా ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకున్నంత మాత్రాన వారి నియోజకవర్గంలో వైకాపా ఉండదనుకుంటే పొరపాటే! ఇక్కడ ఒక్క విషయం గమనించాలి. 2014 ఎన్నికల్లో చూస్తే తమ వ్యక్తిగత సామర్థ్యంతో, నాయకత్వ ప్రతిభతో గెలిచిన ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో ఎక్కువ. వైకాపా నుండి గెలిచిన ఎమ్మెల్యేలలో ఎక్కువ శాతం మంది వై.యస్. సానుభూతితో గెలిచినవాళ్లే!

వైకాపా ఎమ్మెల్యేలు 50మందిపోయినా జగన్ భయపడాల్సిన పనిలేదు. కాకపోతే పార్టీని నిలబెట్టుకోవడమే ఆయన ముందున్న సవాల్. ఈరోజు ఎమ్మెల్యేలు వెళ్లిపోతున్నారని, పలు నియోజకవర్గాలలో కేడర్ లేదని ఆందోళన చెందాల్సిన పని కూడా లేదు. 2014ఎన్నికలకు ముందు రాష్ట్రంలో చాలాచోట్ల తెలుగుదేశంకు పోటీ చేయడానికి అభ్యర్థులే కరువయ్యారు. అలాంటిది ఎన్నికల నాటికి అంతా సెట్ అయిపోయింది. రేపు ఎన్నికలకైనా అంతే! ఈరోజు తెలుగుదేశంలో దూరిన వాళ్లు కాని, ఆల్‌రెడీ అక్కడ వున్నోళ్లు గాని రేపు ఎన్నికలప్పుడు అక్కడే ఉంటారనే గ్యారంటీ లేదు. అవసరం, అవకాశం, పరిస్థితులను బట్టి వైకాపాలోనూ చేరొచ్చు.

కాబట్టి ఇప్పుడు తక్షణం జగన్ ముందున్న కర్తవ్యం తన పార్టీని నిలబెట్టుకోవడం. తన పార్టీలో మిగిలివున్న ఎమ్మెల్యేలను, నమ్మకమైన నాయకులను నిలబెట్టుకోవడం. పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలు జగన్‌పై నిందలు వేస్తున్నారు. ఆయన వద్ద పనిచేయడమంటే పాలేరు పని చేయడమేనని ఆరోపిస్తున్నారు. తన పార్టీ నాయకులకు నిత్యం అందుబాటులో వుంటూ 2019ఎన్నికల దాకా ఆయన పార్టీని లాక్కొస్తే... ఆ ఎన్నికల్లో ఆయన పెద్ద యుద్ధమే చేయొచ్చు.

# విస్తరిస్తే విభేదాలే!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గ విస్తరణ జరిగితే రెడ్ల నుండి మరో ఇద్దరికి అవకాశం ఉండవచ్చు. అయితే నెల్లూరుజిల్లా నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రకాశం జిల్లా నుండి మాగుంట శ్రీనివాసులురెడ్డిలు మంత్రి పదవులు ఆశిస్తున్నారు. కర్నూలుజిల్లా నుండి భూమా నాగిరెడ్డి పేరు ప్రచారంలో వుండగా శిల్పామోహన్‌రెడ్డి వర్గం వ్యతిరేకిస్తోంది. కర్నూలు జిల్లాలో మంత్రిపదవి ఇవ్వడం జరిగితే పార్టీలో మొదట్నుండి ఉన్నవారికి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇంకోపక్క నెల్లూరుజిల్లా నుండి ఇటీవలే కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలో చేరిన ఆనం రామనారాయణరెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. స్థానిక సంస్థల నుండి ఆయనను ఎమ్మెల్సీగా గెలిపించి మంత్రివర్గంలోకి తీసుకోనున్నారనే ప్రచారం వుంది. ఇదే జరిగితే జిల్లా తెలుగుదేశంలో మొదట్నుండి పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు విభేదించే అవకాశముంది. చంద్రబాబు మంత్రివర్గ విస్తరణ అంటూ జరిపితే పాత నాయకులకు పరిమితం చేస్తే ఇబ్బంది లేదు. కొత్తగా చేర్చుకున్న నాయకులకు అవకాశం కల్పిస్తే మాత్రం తెలుగు తమ్ముళ్లలో అసంతృప్తి బద్ధలవడం ఖాయం.

# సెంబ్‌కార్ప్ గాయత్రిల సంబరం

(మొదటి పేజీ తరువాయి)

దొడ్ల వరదారెడ్డి, ఆర్కిటెక్ట్ మోహన్‌రెడ్డిలతో పాటు సెంబ్‌కార్ప్, గాయత్రి ప్రతినిధులు పర్యవేక్షించారు. 2016 యేడాది ప్రారంభంలోనే జరిగిన ఈ కార్యక్రమం భవిష్యత్‌లో జిల్లాలో జరగనున్న పారిశ్రామిక ప్రగతికి శుభసూచికంగా నెల్లూరీయులు భావిస్తున్నారు. సెంబ్‌కార్ప్, గాయత్రి యాజమాన్యానికి 'లాయర్' అభినందనలు.

### మహా ప్రస్థానానికి

## టి.యస్.ఆర్. కోటి రూపాయలు

నెల్లూరు బోడిగాడితోటలోని హిందూ శ్మశానవాటిక "మహాప్రస్థానానికి" రాజ్యసభ సభ్యులు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి కోటి రూపాయలను తన ఎం.పి.లాడ్స్ నుండి అందజేయనున్నట్లు ప్రకటించాడు. జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు ఈ శ్మశాన వాటికలో ఎలక్ట్రిక్ క్రిమిటోరియంను నిర్మించడానికి తన నిధుల నుండి కోటి రూపాయలు అందజేయనున్నట్లు ప్రకటిస్తూ తనకు నెల్లూరు, విశాఖ రెండు కళ్ళులాంటివని, భవిష్యత్తులో నెల్లూరు అభివృద్ధికి తనకి చేతనైన సహాయాన్ని అందిస్తానని సుబ్బరామిరెడ్డి ప్రకటించాడు.

## అలిగిన మీడియా...

సుబ్బరామిరెడ్డికి మీడియా అంటే ప్రాణం. ఆయన ఎక్కడ ఏ కార్యక్రమం చేపట్టినా మీడియా మిత్రులకు పెద్దపీట వేస్తాడు. ప్రజలకీ సమాజానికి మధ్య వారధులుగా పత్రికలు, టివిలు పనిచేస్తాయని వాటి ప్రతినిధులకు సముచిత గౌరవం ఇవ్వడం ప్రతిఒక్కరి బాధ్యతని ఆయన భావిస్తాడు. ఆయన చేసే ప్రతి కార్యక్రమంలోనూ విలేకరులకు ప్రత్యేక స్థానం కల్పించి గౌరవించడం ఆయన ఆనవాయితి. అయితే సెంబ్‌కార్ప్ గాయత్రి ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభోత్సవ సంబరంలో మీడియా మిత్రులను నిర్లక్ష్యం చేశారు. పలు ప్రాంతాల నుండి విచ్చేసిన అతిరథ మహారథులను స్వాగతించడంలో "టియస్సార్" తలమునకలై వుండడంతో మీడియా బాధ్యతలను చేపట్టిన వ్యక్తి కేవలం జాతీయ మీడియా పట్ల తన "వినయ" విధేయతలు చూపించి స్థానిక మీడియాని పట్టించుకోలేదు. సుమారు 3గంటల 15నిముషాలకు ముగిసిన సభా కార్యక్రమం అనంతరం ఆకలితో వుండిన విలేకర్లు భోజనానికి వెళ్తే, మీకిక్కడ కాదు అంటూ 'వినయ్' అనే సెంబ్‌కార్ప్ గాయత్రి ప్రతినిధి విలేకరులను అడ్డుకోవడంతో వారంతా భోంచేయకుండానే వెనుతిరిగారు. స్థానికంగా నిత్యం జరిగే విశేషాలను వార్తలను ప్రజలకు చేరవేసేది స్థానిక విలేకరులే. వారిని నిర్లక్ష్యం చేయడం సబబుకాదు. సుబ్బరామిరెడ్డి ఇలాంటివి అసలు సహించడు. ఆయనకున్న మంచి పేరును సంస్థ ప్రతినిధులు చెడగొట్టకుంటే బాగుంటుంది.



# తమిళనాట తెలుగు సంబరం

చెన్నైలోని తెలుగువారికి ఉగాది పండుగ ఓ నెల ముందే వచ్చింది. ఆలిండియా తెలుగు ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సి.యం.కె.రెడ్డి సారధ్యంలో ఫిబ్రవరి 28వ తేదీ ఆదివారం చెన్నైలోని ఎ.యం.జైన్ కాలేజీ ప్రాంగణంలో అత్యంత వైభవంగా "ఉగాది" వేడుక నిర్వహించారు. తమిళనాడులోని తెలుగువారి సత్తా చాటే విధంగా వేలాదిమంది తెలుగువాళ్ళను ఓ వేదికపైకి చేర్చి వేడుక జరిపాడు డా॥ సి.యం.కె.రెడ్డి. సంస్థ కార్యదర్శి నందగోపాల్ నాయకత్వంలో తమిళనాడు గవర్నర్ రోశయ్య చేతులమీదుగా గానకోకిల పి.సుశీలను, కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అపోలో హాస్పిటల్స్ ఛైర్మెన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డిని సత్కరించగా వెంకయ్యనాయుడుని డాక్టర్ సి.యం.కె.రెడ్డి సత్కరించారు. ఇంకా అనేకమంది తెలుగు ప్రముఖులను ఈ వేదికపైన సత్కరించారు.





# మా ఊరంటే నాకు ప్రాణం

## • రూ. కోటి పది లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం - జి.వి.కె.రెడ్డి



తనకు జన్మనిచ్చిన కొత్తూరంటే తనకు ప్రాణమని తన ఊరి కోసం తన వారి కోసం తానేమైనా చేస్తానని ప్రముఖ పారిశ్రామికవేత్త జి.వి.కె సంస్థల ఛైర్మెన్ జి.వి. కృష్ణారెడ్డి అన్నాడు. తన స్వగ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో నూతనంగా నిర్మించ తలపెట్టిన అదనపు గదుల శంకుస్థాపన కార్యక్రమంలో ఫిబ్రవరి 26వ తేదీ శుక్రవారం సాయంత్రం ఆయన తన సతీమణి ఇందిరమ్మ సమేతంగా పాల్గొన్నాడు.


ఈ ఊర్లోని పొలాల్లో ఆడుకున్నానని, వీధుల్లో తిరిగానని, ఎన్నో మధుర జ్ఞాపకాలు ఈ ఊరి నుండి తీసుకెళ్ళి తనతో భద్రంగా దాచుకున్నానని, అలాంటి ఊరి కోసం ఆ ఊర్లో చదువుకునే వాళ్ళ కోసం తన శక్తిమేరకు సహాయం చేస్తానని చెప్పాడు. జి.వి.కె. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "చిన్మయా స్కూలు" అనతికాలంలోనే మంచి గుర్తింపు పొందిందని, తన గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల కూడా అంతే స్థాయిలో ఫలితాలు సాధించాలని అందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడానికి తాను అన్ని వేళలా సంసిద్ధంగా వుంటానని ఆయన ప్రకటించాడు.

తన తల్లి పేరుతో వున్న గునపాటి రుక్మిణమ్మ జడ్.పి.హైస్కూలులో 80లక్షల రూపాయలతో నిర్మించనున్న అదనపు గదులకు జి.వి.కె దంపతులు శంకుస్థాపన చేశారు. ఇదే సందర్భంలో కొత్తూరు పంచాయితీకి రూ.10లక్షల విలువ చేసే ట్రాక్టర్‌ని అందించడంతో పాటు గ్రామంలో సిమెంటురోడ్డు కోసం 10లక్షలు, గ్రామస్తుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతినిత్యం పరీక్షలు నిర్వహించేలా సెయింట్ జోసెఫ్ ఆసుపత్రి వారికి రూ.10లక్షలు జివికె ఫౌండేషన్ నుండి మంజూరు చేశారు. తాను చేసే ప్రతి పనికీ తన ఊరు తన తల్లే స్ఫూర్తని ఈ సందర్భంగా జివికె రెడ్డి పేర్కొనడం గమనార్హం. కన్నతల్లిని జన్మభూమిని మరువకుండా సేవలు అందిస్తున్న జి.వి.కె అభినందనీయుడు.











Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com